
ఆంధ్రజ్యోతి



కొంతమంది అసూయ, రాజకీయస్వార్థంతో అభివృద్ధి పనులకు అడ్డుపడుతూ రాక్షసానందం పొందుతున్నారని, ఎవరు అడ్డుపడినా అభివృద్ధి, సంక్షేమం ఆగదని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లా వేంసూరు మండలం కల్లూరుగూడెంలో ఆయిల్‌పామ్ కర్మాగారం నిర్మాణానికి మంత్రి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ గతంలో బేతుపల్లి కాలువ తవ్వకం నాటి నుంచి సీతారామ ప్రాజెక్టు కాలువల తవ్వకం, నేడు ఆయిల్‌పామ్ కర్మాగార నిర్మాణం తదితర అభివృద్ధి పథకాలను కొందరు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, అయినా వారి ఆటలు సాగనివ్వలేదన్నారు.





శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల

ఎవరు అడ్డుపడ్డా..
అభివృద్ధి, సంక్షేమం ఆగదు

- కొందరు అభివృద్ధికి అడ్డుపడుతూ రాక్షస ఆనందం పొందుతున్నారు
- అయినా.. వారి ఆటలు సాగనివ్వం
- రైతులను అభివృద్ధి చేయడమే లక్ష్యం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- కల్లూరుగూడెంలో ఆయిల్‌పామ్ కర్మాగారానికి శంకుస్థాపన

వేంసూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ మొక్కలను కరోనా సమయంలో కొందరు బ్రోకర్లు బయట నుంచి తెచ్చి రైతులకు విక్రయించి మోసం చేశారన్నారు. అలాంటి మొక్కల్లో ఆఫ్‌టైప్ మొక్కలు రావడంతో ఆ తప్పులను ఆయిల్‌ఫెడ్‌కు అంటగట్టాలని కొందరు బ్రోకర్లు ప్రయత్నిస్తున్నారన్నారు. అలాంటి వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని ఆయిల్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. విదేశాల నుంచి వచ్చిన మొక్కల్లో నాణ్యతలేని మొక్కలు ఉంటే నర్సరీల్లోనే తొలగించాలని సూచించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో 20లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తాను వ్యవసాయ శాఖ మంత్రి అయిన కొత్తలో టన్ను ఆయిల్‌పామ్ రూ.12,700 ఉండగా ప్రస్తుతం రూ.20,871లకు పెరిగిందని వెల్లడించారు. టన్ను గెలల ధర రూ.21వేలు తగ్గకుండా చూడాలని ఆయిల్‌ఫెడ్ ఎండీ, చైర్మన్లకు సూచించారు. ప్రతి జిల్లాకు ఆయిల్‌పామ్ కర్మాగారం నిర్మించాలనే లక్ష్యంతో ఉన్నామని, ఉద్యానవన పంటల సాగులో దేశానికే మనరాష్ట్రం ఆదర్శంగా ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేకపోయినా సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నారన్నారు. ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టి రాబోయే రోజుల్లో ప్రస్తుతం ఇస్తున్న రూ.6వేల రైతుభరోసాను పెంచుతామన్నారు. ఖమ్మం జిల్లాలో కరువు ప్రాంతాలకు సాగునీటిని అందించేందుకు గతంలో ఎన్టీరామారావు కృషి చేయగా ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేయూతనందిస్తున్నారన్నారు. వచ్చే జూన్ నాటికి సీతారామ ద్వారా గోదావరి జలాలను సత్తుపల్లి నియోజకవర్గానికి మళ్లిస్తామని ప్రకటించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10నియోజకవర్గాల్లో 10లక్షల ఎకరాలకు గోదావరి నీటిని అందించడమే లక్ష్యమన్నారు. గతంలో జలగం వెంగళరావు, సిద్దారెడ్డి శంకుస్థాపనలు చేసిన పథకాలను కూడా తాను పూర్తిచేశానని గుర్తుచేశారు. వ్యవసాయం, జిల్లా అభివృద్ధి, జాతీయ రహదారులు, రాజకీయరంగం తదితర రంగాలలో సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంలో ఖమ్మంజిల్లా ఇతర జిల్లాలు, పక్క రాష్ట్రానికి ఆదర్శంగా ఉందని స్పష్టంచేశారు. ఆయిల్‌పామ్‌కు మినిమమ్ గ్యారంటీ ధర లభించేలా ఏపీలోని ప్రజాప్రతినిధులతో కలిసి కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నామన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే, జంగారెడ్డి

మూడు రోజుల్లోనే రైతులకు నగదు : ఆయిల్‌ఫెడ్ చైర్మన్

ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులు గెలలను విక్రయించిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి తెలిపారు. ఏ పంటలకు ఈ తరహాలో మూడు రోజుల్లో రైతులకు డబ్బు చేతికి వచ్చిన సందర్భంగా లేదన్నారు. ఆఫ్‌టైప్ మొక్కల పేరుతో కొందరు స్వార్థపరులు ఆయిల్‌ఫెడ్‌ను నిర్వీర్యం చేసేలా తప్పుడు ప్రచారం చేస్తూ పత్రికలను ప్రభావితం చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారిపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రైవేట్ కంపనీల పెత్తనం లేకుండా మంత్రి తుమ్మల ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారని, ఫలితంగా ఆయిల్‌ఫెడ్ ద్వారా రైతులకు మంచి ధర (మిగతా 6వ పేజీలో)

ఘనంగా ఉగాది వేడుకలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం



ఖమ్మం గుట్ట ఆలయంలో భక్తులు

ఖమ్మం ఖానాపురంహవేలి/కొత్తగూడెం సాంస్కృతికం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా ప్రజలు విశ్వావసు నామ తెలుగు సంవత్సర ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా ప్రజలు తెల్లవారుజామునే స్నానాలు ఆచరించి, ఇళ్లకు మామిడి తోరణాలు కట్టి, కొత్త దుస్తులు ధరించి, షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి సేవించారు. ఇళ్లల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. నగరంలోని స్తంబాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కమాన్‌బజార్ వేంకటేశ్వరస్వామి ఆలయం, ఇందిరానగర్ రామాలయం(పర్ణశాల), యూపీహెచ్ కాలనీలోని అభయ వేంకటేశ్వర స్వామి ఆలయంతోపాటు పలు ఆలయాల్లో ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేద పండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. నగరంలోని పర్ణశాల రామాలయంలో శ్రీరామనవమి, వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కలశస్థాపన, (మిగతా 6వ పేజీలో)

భద్రాద్రి భవనం కూలిన ఘటనలో
శ్రీపతి దంపతుల అరెస్టు

భద్రాచలం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని బహుళ అంతస్తు భవనం నిర్మాణ సమయంలో కూలి ఇద్దరు కార్మికులు మృతి చెందిన ఘటనలో భవన నిర్మాణదారు శ్రీపతి దంపతులను భద్రాచలం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 26న మధ్యాహ్నం జీ+5తో నిర్మిస్తున్న బహుళ అంతస్తు భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో ఉపేందర్‌రావు, కామేశ్వరరావులు మృతి చెందారు. ఈ నేపథ్యంలో అనుమతులు లేకుండా బహుళ అంతస్తు భవన నిర్మాణం చేపట్టి ఇద్దరు మృతికి కారణమయ్యారనే ఆరోపణలతో శ్రీపతి దంపతులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. వారిని భద్రాచలం ప్రత్యేక సబ్‌జైలుకు తరలించారు. అంతకు ముందు భద్రాచలం పోలీసులు దమ్మపేట జూనియర్ సివిల్‌జడ్జి భవానీ ముందు నిందితులను హాజరుపరగా న్యాయాధికారి వారికి రిమాండ్ విధించారు.



నెలవంక మెరిసింది..
ఉపవాసం ముగిసింది

- నేడు రంజాన్ వేడుకలు
- ఈద్-ఉల్-ఫితర్‌కు ఈద్గాలు ముస్తాబు
- ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమైన ముస్లింలు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు చేసిన 30 రోజులు ఉపవాస దీక్షలు షవ్వాల్ మాసం నెలవంక కనిపించటంతో ముగిశాయి. ఆకాశంలో ఆదివారం సాయంత్రం నెలవంక కనిపించటంతో సోమవారం రంజాన్ పండుగ జరుపుకోవాలని ముస్లిం మత పెద్దలు నిర్ణయించారు. ఈద్-ఉల్-ఫితర్ నిర్వహించేందుకు ఈద్గాలను ముస్తాబు చేశారు. నెల రోజులు రంజాన్ ఉపవాస దీక్షలు పాటించిన ముస్లింలు మాసం అనంతరం షవ్వాల్ మాసపు మొదటి రోజు జరుపుకునే పండుగను ఈద్-ఉల్-ఫితర్ అంటారు. ఈద్గాలలో నమాజ్ అనంతరం ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకుంటారు. ధనికులు, పేదలు అనే తేడా లేకుండా సమాజంలో ముస్లింలందరూ ఒకే విధమైన దిన చర్యలను పాటిస్తారు. ఖమ్మం నగరంలోని గొల్లగుడెం, గాంధీ చౌక్ ఈద్గాలను ప్రత్యేక ప్రార్థనల కోసం ముస్తాబు చేశారు. ప్రార్థనలు చేసేందుకు ముస్లింలు అధిక సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో అధికారులు ఎటువంటటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేశారు. నగరంలోని కమాన్‌బజార్ రంజాన్ కొనుగోళ్లతో సందడిగా మారింది. రంజాన్ రోముస్లింలు ప్రత్యేకంగా సేమ్యా తయారు చేసి కులమతాలకు అతీతంగా స్నేహితులకు, బంధువులకు పంచిపెడతారు. పేద ముస్లిం కుటుంబాలకు కొంత మంది ఆర్థిక సహాయం అందిస్తారు. రంజాన్ పండుగ సందర్భంగా పలువురు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

రామయ్య కల్యాణానికి అంకురార్పణ

భద్రాద్రిలో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

- ఉత్సవాంగ స్నపనంతో ఆరంభం
- సంప్రదాయబద్ధంగా మృత్సంగ్రహణం
- ఉగాది వేడుకల్లో పంచాంగ శ్రవణం
- రామయ్య ఆదాయం 8, వ్యయం 2
- సీతమ్మ ఆదాయం 14, వ్యయం 2

భద్రాచలం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలకు ఉగాది రోజు ఆదివారం సంప్రదాయబద్ధంగా శ్రీకారం చుట్టారు. శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో ఉత్సవాంగ స్నపనంతో వసంతపక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ఆరంభమయ్యాయి. ముందుగా శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని తెల్లవారుజామున 4 గంటలకు సుప్రభాతసేవ నిర్వహించారు. అనంతరం ఆరాధన, ఉగాది ప్రసాద నివేదన చేశారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే రుత్వికులకు, సిబ్బందికి భద్రాద్రి దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్ దీక్ష వస్త్రాలను అందజేశారు. మూలవరులకు అభిషేకం, బేడా మండపంలో ఉత్సవమూర్తులకు ఉత్సవాంగ స్నపనంతో వసంతపక్ష బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇదిలా ఉండగా సాయంత్రం గోవిందరాజస్వామి ఆలయం(తాత గుడి)కు శ్రీ సీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులను తీసుకెళ్లి మృత్సంగ్రహణంను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భూ వరాహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మట్టిని సేకరించి కల్యాణ అంకురార్పణకు వినియోగించారు. నవమి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కావడంతో ఆదివారం నుంచి ఏప్రిల్ 12 వరకు నిత్యకల్యాణాలు నిలిపివేశారు. అలాగే ఏప్రిల్ 20 వరకు పవళింపు సేవలు కూడా నిలిపివేశారు. అదేవిధంగా 12వ తేదీ వరకు దర్బారు సేవలు సైతం నిలిపివేశారు. ఉగాదిని పురస్కరించుకొని రాత్రి శ్రీసీతారామచంద్ర స్వామికి కల్పవృక్ష వాహనసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రావణ్‌కుమార్, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకుడు కోటి రామస్వరూప్ రాఘవాచార్య, ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజం, అమరవాది గోపాలాచార్యులు, ముఖ్య అర్చకులు పొడిచేటి రామభద్రాచార్యులు పాల్గొన్నారు.

విశ్వావసులో పెరగనున్న రామయ్య ఆదాయం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో భద్రాద్రి రామయ్య ఆదాయం పెరగనుందని వ్యయం తగ్గే అవకాశాలున్నాయని దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి తెలిపారు. భద్రాచలంలో ఆదివారం రాత్రి శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని నిత్యకల్యాణ మండపం వద్ద పంచాంగ శ్రవణం చేశారు. భద్రాద్రి రామయ్య ఆదాయం 8, వ్యయం 2 ఉంది. రాజపూజ్యం 7, అవమానం 3, ఉందన్నారు. కాగా సీతమ్మవారికి ఆదాయం 14, వ్యయం 2, రాజపూజ్యం 6, అవమానం 6గా ఉంటుందన్నారు. దేశంలో ప్రజలు సుఖశాంతులతో విలాసవంతమైన జీవితం గడుపుతారని తెలిపారు. రాజకీయంగా కల్లోలాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. ధాన్యాల ధరలు పెరుగుతాయని, ఆషాడమాసంలో అల్పవృష్టి, శ్రావణ, భాద్రపదాల్లో కొన్ని చోట్ల దుర్భిక్షం ఏర్పడే అవకాశాలున్నాయన్నారు. వెండి, బంగారం ధరల్లో పెద్దగా మార్పు ఉండదని, ప్రపంచంలో యుద్ధ వాతావరణం ఉంటుందని తెలిపారు. పాడిపంటలకు లోటు లేదన్నారు. అంతకు ముందు శ్రీ సీతారామచంద్రస్వామి సన్నిధి వద్ద నూతన పంచాంగాలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానాచార్యులకు పంచాంగాన్ని తాంబూలంతో అందజేశారు.



భద్రాద్రి రామాలయంలో అంకురార్పణ చేస్తున్న దృశ్యం

వేడుకలకు రారండి

- భద్రాద్రి రామయ్య కల్యాణం, మహా పట్టాభిషేకాలకు రండి
- సీఎం, గవర్నర్‌లకు దేవస్థానం ఈవో, వైదిక సిబ్బంది ఆహ్వానం
- ఇద్దరికీ రాజపత్రాల అందజేత 6

అర్హులందరికీ ఆరు గ్యారెంటీల ఫలాలు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఎర్రుపాలెం మండలంలో ఆకస్మికంగా పర్యటన
- కాచవరంలో ప్రజలతో మమేకం

ఎర్రుపాలెం, మార్చి30(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఆరు గ్యారెంటీ పథల ఫలాలు అందుతాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఎర్రుపాలెం మండలంలోని కొత్తకాచవరం, కొత్తగోపవరం గ్రామాల్లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదివారం ఆకస్మికంగా పర్యటించారు. అధికార కార్యక్రమాల్లో నిత్యం బిజీగా ఉండే డిప్యూటీ సీఎం ఉగాది సందర్భంగా ఎర్రుపాలెం మండలంలోని పల్లె ప్రాంతాల్లో పర్యటించి గ్రామస్థులతో ముచ్చటించారు. కాచవరం గ్రామంలో అమృత లింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలతో మమేకమై ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరుని అడిగి తెలుసుకున్నారు. అందరికీ జీరో కరెంట్ బిల్లులు వస్తున్నాయా? మహాలక్ష్మి గ్యాస్‌బండలు, అకౌంట్‌లో రైతు భరోసా డబ్బులు పడ్డాయా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ ఆరుగ్యారంటీల ఫలాలు అందుతాయని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తయిందని, ఇళ్లులేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఇందిరా మహిళ డైరీ ద్వారా మహిళలందరికీ గేదెలు పంపిణీ చేస్తామని భరోసా ఇచ్చారు. కాచవరం గ్రామంలో వృద్ధ కాంగ్రెస్ నాయకురాలు కేవీస్ నర్సమ్మను ఆత్మీయంగా పలకరించారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న భట్టి

ఎల్‌ఆర్‌ఎస్‌తో రూ.34 కోట్ల ఆదాయం

- ప్రాపర్టీ ట్యాక్స్‌తో ఇప్పటివరకు రూ.31.22 కోట్లు
- నేటితో ముగుస్తున్న ఎల్‌ఆర్‌ఎస్, ఆదాయ వసూళ్ల గడువు
- నేడు ఎల్‌ఆర్‌ఎస్, ప్రాపర్టీ ట్యాక్స్ కౌంటర్ల కొనసాగింపు
- పండగ రోజు కూడా విధుల్లో ఖమ్మం కార్పొరేషన్ ఉద్యోగులు

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్, ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్ల గడువు సోమవారంతో ముగుస్తుండడంతో ఖమ్మం కార్పొరేషన్ అధికారులు వసూళ్ల లక్ష్యాలను చేరుకునేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. నేటితో గడువు ముగుస్తుండడంతో కార్పొరేషన్ ఉద్యోగులు సోమవారం రంజాన్ పండుగ సెలవు ఉన్నా విధులకు హాజరుకానున్నారు. ఖమ్మం నగరంలో సెప్టెంబరులో మున్నేరు వరదలు, తర్వాత బాధితుల గుర్తింపు సర్వే, ఆ తర్వాత పరిహారం పంపిణీ కార్యాచరణ, బాధితుల బ్యాంకు ఖాతాలకు పరిహారం పంపిణీ, వెనువెంటనే ఇందిరమ్మ సర్వే, తర్వాత సమగ్ర కుటుంబ సర్వే, ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ఇలా గత ఆరు నెలలుగా ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు తీరిక లేకుండా పని చేస్తున్నారు. ఈ క్రమంలో వార్షిక ఏడాది ముగింపు రావటంతో ఒక వైపు ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, మరో వైపు ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లు ఒకేసారి రావటంతో కేఎంసీలోని అన్ని విభాగాల అధికారులు ఉద్యోగులపై పనిభారం పడింది.

ప్రతికూలంలోనూ అనుకూల ఆర్థిక ఫలితాలు

ప్రతి సంవత్సరం నవంబరు, డిసెంబరు నెలల్లో ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లు ప్రారంభమవుతాయి. అలాగే ఫిబ్రవరి మొదటి వారంలో (మిగతా 6వ పేజీలో)



నవమి కల్యాణ స్వాగత గీతాన్ని
ఆవిష్కరించిన గవర్నర్

భద్రాచలం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి వసంతపక్ష తిరు కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 6న నిర్వహించే శ్రీరామనవమి కల్యాణ స్వాగత గీతాన్ని ఆదివారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఆదివారం భద్రాద్రి దేవస్థానం అధికారులు గవర్నర్‌ను శ్రీరామ మహాపట్టాభిషేకానికి ఆహ్వానించేందుకు వెళ్లిన క్రమంలో ఈ గీతాన్ని ఆయన ఆవిష్కరించారు. భద్రాచలం దేవస్థానం రామాయణపారాయణదారు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్య రచించిన నవమి కల్యాణ స్వాగత గీతాన్ని ప్రముఖ సినీ నేపథ్య గాయకులు నేమాని పార్థసారధి బృందం గానం చేశారు. కాగా ఈ గీతం రచయిత, గాయకులను గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో గవర్నరు జిష్ణుదేవ్ వర్మతోపాటు భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఉప ప్రధాన అర్చకుడు అమరవాది గోపాలకృష్ణమాచార్యులు, రామాయణపారాయణదారు, గీత రచయిత ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచారులు, ఈవో సీసీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



దేవస్థానం ఆధ్వర్యంలో గవర్నర్‌ను కలిసి సత్కరిస్తున్న దృశ్యం

రామయ్యను దర్శించుకున్న ట్రైకార్ చైర్మన్



రామాలయంలో ట్రైకార్ చైర్మన్

భద్రాచలం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామిని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ కు టుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు దేవస్థానం పర్యవేక్షకులు సాయిబాబా, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు లక్ష్మీతాయారు అమ్మవారిని, ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం వేద ఆశీర్వచనం అందజేసి దేవస్థానం తరఫున జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో భాస్కర్, ఏవో సున్నం రాంబాబు, డీఎస్‌వో ప్రభాకర్‌రావు పాల్గొన్నారు. అనంతరం ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్ ఐటీడీఏ కార్యాలయంలో ఉన్న గిరిజన మ్యూజియాన్ని సందర్శించి అక్కడ గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించి ఏర్పాటు చేసిన వివిధ పరికరాలను, సాంస్కృతిక పరికరాలను పరిశీలించారు.

వాయిద్య సిబ్బందికి ఉగాది పురస్కారాల అందజేత

భద్రాచలం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న వైదిక, వాయిద్య సిబ్బంది ఐదుగురు 2025 రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారాలు అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం జరిగిన వేడుకల్లో వీరు రాష్ట్ర దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ ఈ.శ్రీధర్ చేతులమీదుగా పురస్కారాలు అందుకున్నారు. దేవస్థానంలో రామాయణ పారాయణదారుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, వాయిద్య బృందంలో శృతిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



ఉగాది పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

భద్రాద్రి వేడుకలకు రారండి

» ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వానం



సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్‌ను ఆహ్వానిస్తున్న దేవస్థానం వైదిక సిబ్బంది

భద్రాచలం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి సన్నిధిలో ఏప్రిల్ 6న శ్రీరామనవమిని పురస్కరించుకొని నిర్వహించే సీతారాముల కల్యాణానికి రావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, వైదిక సిబ్బంది ఆదివారం ఆహ్వానించారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం జరిగిన ఉగాది వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డిని దేవస్థానం వైదిక పరిపాలన అధికారులు కలిశారు. ఈ సందర్భంగా రామయ్య కల్యాణానికి రావాలని ఆహ్వానిస్తూ రాజప్రతిన్ని చదివి వినిపించి అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావులకు స్వామివారి ప్రసాదం, ఆహ్వాన పత్రికలను అందజేసి వేద ఆశీర్వచనం అందించారు. అలాగే ఏప్రిల్ 7న నిర్వహించనున్న శ్రీరామ మహాపట్టాభిషేకంలో పాల్గొనాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఆహ్వానించారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు రాజపత్రం చదివి వినిపించి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, వైదిక సిబ్బంది అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు స్వామివారి ప్రసాదం, ఆహ్వాన పత్రిక, కాలువా అందజేసి వేద ఆశీర్వచనం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఉప ప్రధాన అర్చకులు అమరవాది గోపాలకృష్ణమాచార్యులు, రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, ఈవో సీసీ శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు

(5వ పేజీ తరువాయి)

పుష్పాభిషేకం, అంతరాలోహణ కార్యక్రమాలు నిర్వహించారు.

కొత్తగూడెంలో ఘనంగా ఉగాది వేడుకలు

భద్రాద్రి జిల్లాలోనూ ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం, భద్రాచలం, అశ్వారావుపేట, పినపాక, ఇల్లెందు నియోజకవర్గాల్లో ఉగాది పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ త్రిమాత శక్తి పంచాయతన క్షేత్ర దేవాలయంలో ఉగాది సందర్భంగా హనుమాన్ సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీవిష్ణు సహస్ర నామ స్తోత్రం, శ్రీ హనుమాన్ చాలీసా పఠనకార్యక్రమంలో సింగరేణి ఫైనాన్స్ జనరల్ మేనేజర్ మల్లెల వెంకట సుబ్రహ్మణ్యశర్మ చేతుల మీదుగా నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చిట్టి కథల చిన్నారికి సన్మానం

ఉగాది కవి సమ్మేళనంలో 'గూడెం' చిన్నారి రచయితకు దక్కిన గౌరవం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): చిన్నారి - చిట్టి కథలు పుస్తకాన్ని రచించిన కొత్తగూడెం వాసి బొమ్మసాని బోధిత సుగంధినికి అరుదైన గౌరవం దక్కింది. శ్రీవిశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా ఖమ్మం పట్టణంలో తెలంగాణ సాహితీ వారు ఉగాది కవి సమ్మేళన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో నవభారత్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని బోధిత సుగంధినిని అభినందిస్తూ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. పద్నాలుగేళ్ల వయస్సులోనే కథా రచన చేపట్టడం వల్ల సృజనాత్మకత పెరుగుతుందని నిరూపించిందని నిర్వాహకులు కొనియాడారు. ఆదివిధంగా సమాజాన్ని దగ్గరగా చూడడం అలవడుతుందని వక్తలు తెలియజేశారు. అనంతరం చిన్నారి బోధిత సుగంధిని మాట్లాడుతూ తన చిన్న నాటి నుంచి అమ్మమ్మ దివంగత నంది రాధ చెప్పిన కథలను వింటూ, అనేక సందేహాలు నివృత్తి చేసుకుంటూ ఉండేదాన్ని అని గుర్తు చేశారు. తిరిగి వాటిని నాకు నచ్చినట్లుగా మార్చి చెప్పేదాన్ని అని, నా ఆలోచనలు అభిరుచిని నా తల్లిదండ్రులు బొమ్మసాని విజయప్రకాశ్ - జ్యోతిర్మయిలకు తెలుపుతూనే స్వప్నం చేసింది. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో కథా రచనవైపు ఉత్సాహంగా అడుగులు వేసి విజయం సాధించానని పేర్కొన్నారు. అనంతరం విరచించిన శ్రీ రచన, జగన్నాథ రథచక్రాలు కవిత సభికులను అలరించింది. ఈ సమ్మేళనంలో సాహితీ వేత్త చేకూరి శ్రీనివాసరావు, ప్రముఖ కవి జీవన్, తెలంగాణ సాహితీవేత్త పురిమళ్ల సునంద, సమన్వయకర్త డాక్టర్ కటుకోజ్వల రమేష్, శశికుమార్, యలమంచిలి జయచంద్ర సాయి, పూర్ణచందర్‌రావు, రేశ్వంత్, బొమ్మసాని సంతోష్ పాల్గొన్నారు.



చిన్నారి సుగంధినిని సన్మానిస్తున్న తెలంగాణ సాహితీ నిర్వాహకులు

నేటినుంచి కోటమైసమ్మతల్లి
బ్రహ్మోత్సవాలు



కారేపల్లి మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికాయలపల్లిలో గల శ్రీకోటమైసమ్మతల్లి ఆలయంలో నేటినుంచి మూడురోజులపాటు అమ్మవారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ డాక్టర్ వడ్లపాట్ల రామారావు, ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వేణుగోపాలాచార్యులు ఆదివారం తెలిపారు. మొదటిరోజు విఘ్నేశ్వరపూజ, పాశుపత హోమం, రెండో రోజు శ్రీమహారాజ సమేత రామలింగేశ్వరస్వామి వారి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, గ్రామస్తుల చేత జలబిందెల అభిషేకం, మూడో రోజు మహాపూర్ణాహుతి పవిత్రారోహణం, ఆశీర్వచనంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

భద్రాచలం ఆలయానికి భక్తబృందం పాదయాత్ర

కల్లూరు, మార్చి30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పేరువంచ గ్రామానికి చెందిన ఓ భక్తబృందం ఆదివారం భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారి ఆలయ దర్శనానికి పాదయాత్రగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా యాదవ్ భక్త బృందానికి మధ్య మార్గంలో బూర్గుడెం ముత్యాలమ్మ దేవాలయం వద్ద పేరువంచకు చెందిన కేసర మోహనరెడ్డి, నిర్మల దంపతులు భక్త బృందానికి భోజన వసతి, శీతలపానీయాలు కల్పించారు. పాదయాత్ర చేపట్టిన భక్త బృందం క్షేమంగా తమ యాత్ర పూర్తి చేసుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పరిమి భరత్, గోపాలరావు, కోట బన్నీ కొండపల్లి మురళీ, ఆవుల తిరపతిరావు, వెంకటేశ్వరరావు, పాశం శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

గోటి తలంబ్రాలతో పాదయాత్ర



గోటి తలంబ్రాలతో పాదయాత్రగా వెళుతున్న భక్తులు

లక్ష్మీదేవిపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తెలగారామవరం రామాలయం నుంచి గోటి తలంబ్రాలతో భక్తులు ఆదివారం భద్రాచలానికి పాదయాత్రగా తరలివెళ్ళారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని పది రోజుల నుంచి గోటితలంబ్రాలను భక్తులు తయారుచేసి స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రగా భద్రాచలానికి చేరుకుని రామాలయంలో అర్చకులకు అందించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు బాల పురుషోత్తం, వ్యాసారపు నరసింహ, రమేష్, సంపత్, వేణు, నాగప్రవీణ్, బద్రి, వంశీ పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఆలయంలోకి తీర్థపు బిందెను తెస్తున్న ప్రధాన అర్చకులు

ఎర్రుపాలెం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వర ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉగాది పర్వదినం సందర్భంగా తెల్లవారుజామున శ్రీవారికి సుప్రభాత సేవ నిర్వహించి పంచామృతాలతో సర్వాంగాభిషేకం నిర్వహించారు. అనంతరం నూతన వస్త్రాలను సమర్పించి రజిత కవచాలంకారంలో శ్రీవారిని భక్తులకు దర్శనం కల్పించారు. ఉగాది పచ్చడిని నివేదన చేసి భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం భక్త కల్యాణం నిర్వహించారు. సాయంత్రం మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛారణ మధ్య ఆలయ సాంప్రదాయంలో తీర్థపు బిందెను తెచ్చి అర్చకులు యాగశాల ప్రవేశం చేశారు. ఆలయ ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి నవరాత్రి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, ఆలయ మహారాజ పోషకులు తుళ్లూరి కోటేశ్వరరావు, నిర్మలకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎవరు అడ్డుపడ్డా అభివృద్ధి, సంక్షేమం ఆగదు

(5వ పేజీ తరువాయి)

లభిస్తోందన్నారు. తమ ప్రాంతంలోని తెల్లారులో ఆయిల్‌పామ్ కర్మాగారానికి నిధులు కేటాయించాలని ఆయన కోరారు.

వచ్చే ఉగాదికి కర్మాగారం ప్రారంభం

వచ్చే ఉగాది నాటికి కల్లూరుగూడెంలో ఆయిల్‌పామ్ కర్మాగారం ప్రారంభోత్సవం జరుగుతుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. ఈ ప్యాక్టరీతో స్థానికంగా సుమారు 200మంది యువతకు ఉపాధి లభించనుందన్నారు. గత ఎన్నికలలో మంత్రి తుమ్మల ఇచ్చిన హామీ మేరకు కల్లూరుగూడెంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ శంకుస్థాపన జరిగిందన్నారు. సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న మంత్రులు తుమ్మల, పొంగులేటి, భట్టిలకు కృతజ్ఞతలు తెలిపారు. బుగ్గపాడులోని ఫుడ్ పార్కులో త్వరలో బహుళజాతి కంపెనీలు ప్రారంభం కానున్నాయన్నారు. వచ్చే ఆగస్టు 15నాటికి గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే పై వాహనాల రాకపోకలు ప్రారంభమవుతాయన్నారు.

కర్మాగారానికి శంకుస్థాపన

కల్లూరుగూడెంలో 42ఎకరాల విస్తీర్ణంలో రూ.87కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఆయిల్‌పామ్ కర్మాగారానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ యాస్మిన్‌బాషాలతో శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అధికార, అనధికార ప్రముఖులు పలువురు పాల్గొన్నారు. అంతకుముందు మర్లపాడు సెంటర్ నుంచి సభావేదిక వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీలో అభివాదం చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

కోడ్ ముగిసినా తొలగని ముసుగులు

వైరా, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ ముగిసి నెలరోజులు కావస్తున్నప్పటికీ ఇంకా జాతీయ, రాష్ట్ర నేతల విగ్రహాల ముసుగులు తొలగలేదు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలకు సంబంధించి ఈనెల ఐదోతేదీనే ఎన్నికల కోడ్ ముగిసింది. అయినా ఇంకా అధికార యంత్రాంగం, రాజకీయ పార్టీల నేతలు ఎన్నికల కోడ్ భ్రమల్లోంచి బయటపడలేదు. కనీసం పలుచోట్ల తమ నేతల విగ్రహాలకు ఉన్న ముసుగులను తీసివేసేందుకు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు దృష్టిసారించలేదు. దీన్ని బట్టి ప్రస్తుత పరిస్థితుల్లో తమ నాయకుల విగ్రహాల పట్ల రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలకు ఎంత అభిమానం, చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. కోడ్ రాగానే నాయకుల విగ్రహాలకు ముసుగులను వేసే అధికార యంత్రాంగం ఆతర్వాత వాటిని తొలగించే విషయంలో మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుందనే విమర్శలున్నాయి.

జిల్లా ఆస్పత్రిలో 575 పడకలు..

» ఉత్తర్వులు జారీ చేసిన డీఎంఈ

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆస్పత్రి పడకలు పేదీ నేటి నుంచి తెరదించింది. వైద్య విధాన పరిషత్‌లో కొనసాగినప్పుడు 575 పడకలుగా ఉన్నప్పటికీ రెండేళ్ల క్రితం మెడికల్ కళాశాలకు అనుసంధానంగా మారినప్పుడు మెడికల్ డైరెక్టరేట్ నుంచి 430 పడకలకే అనుమతి ఇచ్చింది. దీంతో 2023 నవంబరు నుంచి జిల్లా ఆస్పత్రిలో పడకల పేచీ కొనసాగుతూ వచ్చింది. 1956లో జిల్లా ఆస్పత్రి 100 పడకలతో ప్రారంభం అయ్యింది. 2000 వేల సంవత్సరంలో 250 పడకలకు అప్‌గ్రేడ్ అయ్యింది. 2017లో 150 పడకలు, 2019లో 100 పడకలు మొత్తం కోవిడ్ సమయంలో అత్యవసర విభాగాలతో పాటు మాతాశిశు కేంద్రానికి మొత్తం 575 పడకలతోగా అప్‌గ్రేడ్ అయ్యింది.

2023 నవంబరులో మెడికల్ కళాశాలకు అనుసంధానంగా జనరల్ ఆస్పత్రిగా దీన్ని మార్చారు. అప్పటి వరకు వైద్యవిధాన పరిషత్ విభాగంలో నిర్వహించిన ఆస్పత్రి కాస్తా డీఎంఈ పరిధిలోకి వచ్చింది. డీఎంఈ పరిధిలోకి వచ్చినప్పుడు జిల్లా ఆస్పత్రికి కేవలం 430 పడకలుగానే గుర్తించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో పారిశుధ్య కాంట్రాక్టరుకు, డీఎంఈకు మధ్య వాగ్వాదం జరుగుతోంది. జిల్లా ఆస్పత్రిలో 575 పడకలకు గాను 259 మంది సిబ్బంది పనిచేసే లా చైతన్యజ్యోతి వెల్ఫేర్ ఏజెన్సీకి 17సెప్టెంబరు 2022 నాటి నుంచి బాధ్యతలు అప్పగించారు. అప్పటి అగ్రిమెంట్ ప్రకారం 250 మంది సిబ్బందికి (70 మంది సెక్యూరిటీగార్డులు, 80 మంది పేషెంట్ కేర్, 190 మంది సానిటేషన్ సిబ్బంది) ప్రతి నెలా రూ.50లక్షల 88 వేలు చెల్లించారు. అప్పటి నుంచి 2023 అక్టోబరు 1 వరకు కాంట్రాక్టర్‌కు చెల్లించారు. 2023 నవంబరులో డీఎంఈకి మారిన తర్వాత కేవలం 430 పడకలకే నిధులు విడుదల చేస్తుండడంతో పారిశుధ్య కార్మికులకు వేతనాల చెల్లింపుల్లో ప్రతి నెలా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో చైతన్య జ్యోతి వెల్ఫేర్ ఏజెన్సీ ప్రతినిధి రామారావు వేతనాలు చెల్లించక పోవడంతో కార్మికులు ప్రతి నెలా ఆందోళన చేస్తున్నారు. ఈ బకాయిల్ని మెయిల్‌చేసి కాంట్రాక్టర్ రామారావు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో హైకోర్టు కాంట్రాక్టర్‌కు అనుకూలంగా తీర్పునిచ్చింది. దీంతో ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రికి 575 పడకలకు అనుమతిని ఇస్తూ వైద్యవిద్య డైరెక్టర్ డాక్టర్ ఎ. నరేంద్రకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎల్‌ఆర్‌ఎస్‌తో రూ.34 కోట్ల ఆదాయం

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రాపర్టీ ట్యాక్స్ వడ్డీలపై 90శాతం రాయితీని ప్రకటిస్తోంది. ఈ రెండు అంశాలు ఆదాయ వనరుల్లో కేఎంసీకి ఉద్యోగులకు అనుకూలంగా ఉంటాయి. కానీ సంవత్సరం నవంబరు, డిసెంబరు, జనవరి మాసాలు వరకు మున్సిపల్ వరదల సహాయం, సమగ్ర కుటుంబ సర్వే ప్రజాపాలన దరఖాస్తులు, ఇందిరమ్మ సర్వే కోసం బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు విధులు కేటాయించారు. దీంతో ఫిబ్రవరి చివరివారం నుంచి ఆదాయ వనరుల్లో వేగం పెరిగింది. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రత్యేక చొరవ తీసుకొని ఖమ్మం నగరంలోని 85 ప్రభుత్వ కార్యాలయాలకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ద్వారా నోటీసులు పంపించేయించారు. పెండింగ్‌లో ఉన్న ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్ చేయించారు. అసిస్టెంట్ కమిషనర్ షఫీ ఉల్లా, ఆర్వో శ్రీనివాసరావు సైతం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల వారీగా డైలీ టార్గెట్‌ను ఇచ్చారు. ఆదివారం సెలవు కూడా లేకుండా బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లతో ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లు చేయించారు. దీంతో గతేడాది కేఎంసీకి రూ.30.80 కోట్లు ఆదాయం రాగా ఆదివారం గతేడాది టార్గెట్ అధిగమించింది. ఇప్పటివరకు రూ.31.22 కోట్లు సాధించింది. గతేడాది కంటే రూ.42 లక్షలు ఆదాయం పెరిగింది. సోమవారం రంజాన్ పండుగ రోజు సైతం అధికారులు విధులకు హాజరు కానున్నారు.

రూ.34 కోట్ల ఎల్‌ఆర్‌ఎస్ ఆదాయం

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనలో ఖమ్మం నగర పాలక సంస్థ రాష్ట్రంలో టాప్ స్థానంలో నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు నుంచి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రక్రియ వేగవంతంగా జరిగింది. అదే సమయంలో ఖమ్మంలో వివాదాలు, ఇతర కార్యక్రమాలపై పట్టణ ప్రణాళిక అధికారులు బాధ్యతలు నిర్వహించారు. నవంబరు, డిసెంబర్ నుంచి కొంతమేర వేగవంతం అయిందనుకొన్నారు. తర్వాత నర్సర్, ఎల్ 1, ఎల్ 2, క్షేత్రస్థాయిలో పరిశీలనలు, సాంకేతిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఫిబ్రవరి నుంచి కేఎంసీ కమిషనర్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. 15రోజుల క్రితం 20శాతం రాయితీ ప్రభుత్వం ప్రకటించింది.



ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్న సిబ్బంది

దీంతో శని, ఆదివారాలు కూడా పట్టణ ప్రణాళిక అధికారులు, ఉద్యోగులు పనిచేశారు. మార్చిలో కీలకంగా బాధ్యతలు నిర్వహించారు. దీంతో ఇప్పటి వరకు 5,800ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పేమెంట్ పూర్తి కాగా రూ.34కోట్లు ఆదాయం సమకూరింది. 2,600 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు ప్రొసిడింగ్స్ పంపిణీ జరిగింది. ప్రొసిడింగ్స్ పంపిణీ, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్లియరెన్స్ పర్సంటేజీలో ఖమ్మం మొదటి స్థానంలో నిలిచింది.

నేడు చెల్లింపులకు అవకాశం

మార్చి 31 వరకు ఆదాయ వసూళ్లు, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనకు తుది గడువు ప్రభుత్వం ప్రకటించడంతో సోమవారం సెలవు రోజు కూడా ఖమ్మం నగర పాలక సంస్థలోని ఎల్ఆర్ఎస్, ఆదాయ వసూళ్ల కౌంటర్లు పనిచేయనున్నాయి. ఈ మేరకు కేఎంసీలో అదనంగా 8 కౌంటర్లను కేటాయించి ఉద్యోగులను కమిషనర్ అభిషేక్ అగస్త్య నియామకం చేశారు. ప్రజలు ఎల్‌ఆర్‌ఎస్, ఆదాయ వసూళ్ల చెల్లింపులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రకటన విడుదల చేశారు.

జేకే ఓసీ కొనసాగింపునకు నిర్ణయం

» యథాతథంగా బొగ్గు ఉత్పత్తికి సింగరేణి సీఎండీ ఆదేశాలు

ఇల్లెందు టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే5 ఓసీ కొనసాగింపుకు సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. ఈ నెల 31కే ఓసీ మూసివేయనున్నట్లు ఏరియా అధికారులు ప్రకటించడంతో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఓసీని సందర్శించి బొగ్గునిల్వలను పరిశీలించారు. మరికొంతకాలం వెలికి తీయడానికి నిల్వలు ఉన్నప్పటికీ గని ఉపరితలం కూలుతుందనే కారణంతో ఓసీని మూసివేస్తామని ఏరియా జీఎం కృష్ణయ్య ప్రకటించడంతో ఓసీ కార్మికులు ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలోనే ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఓసీని పరిశీలించిన అనంతరం సింగరేణి ఉన్నతాధికారులతోపాటు జిల్లా మంత్రులతో మాట్లాడి సమస్యను వివరించారు. దీంతో సింగరేణి సీఎండీ బలరాంనాయక్ రంగంలోకి దిగి జేకే5 ఓసీలో ఉన్న బొగ్గునిల్వలు ఇతర సమాచారాన్ని సేకరించారు. డైరెక్టర్‌ను పంపి ఓసీ పరిస్థితిపై అంచనాకు వచ్చినట్లు సమాచారం. ఈ మేరకు మరో మూడు నెలలపాటు రొంపేడు ఓసీ వచ్చేవరకు ప్రస్తుత జేకే5 ఓసీని కొనసాగించేవిధంగా ఆదేశాలు ఇచ్చారు. ఈ ఆదేశాల మేరకే ఓసీని కొనసాగించేందుకు అధికారులు తగిన ప్రణాళికలు రూపొందించారు. కార్మికుల్లో బదిలీల భయం తొలగించడంతోపాటు యథావిధిగా జేకే5 ఓసీని కొనసాగించనున్నట్లు సింగరేణి అధికారులు ప్రకటించారు. ఓసీ కొనసాగించేందుకు తీవ్రప్రయత్నాలు చేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్యకు సైతం ఏరియా కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

బొగ్గుగనులకు పుట్టినిల్లైన ఇల్లెందు ఏరియా మనుగడకు కృషి చేస్తానని సీఎండీ బలరాంనాయక్ హామీ ఇచ్చారు. త్వరలోనే రొంపేడు, పూసపల్లి ఓపెన్‌కాస్టుకు అనుమతులు వచ్చేవిధంగా కృషి చేస్తున్నట్లు సీఎండీ ప్రకటించారు. పూర్వవైభవం తెచ్చేలా తనవంతు సహాయం అందిస్తానని సీఎండీ ప్రకటించారు.

వీకే7 ఓపెన్‌కాస్టుకు పర్యావరణ అనుమతులు

» సింగరేణి కొత్తగూడెం ఏరియాకు మహర్దశ

» త్వరలోనే పనుల ప్రారంభానికి చర్యలు

రుద్రంపూర్, (సింగరేణి) మార్చి 30(ఆంధ్రజ్యోతి): సింగరేణి కొత్తగూడెం ఏరియా వీకే7(వెంకటేశ్ ఖని) ఓపెన్‌కాస్టుకు పర్యావరణ అనుమతులు లభించినట్లు సింగరేణి యాజమాన్యం ప్రకటించింది. మూడు సంవత్సరాలుగా వీకే7 ఓపెన్‌కాస్టు ఏర్పాటు కోసం సింగరేణి యాజమాన్యం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఫారెస్ట్ అనుమతులు లభించడంలో తీవ్ర జాప్యం జరిగింది. ఎట్టకేలకు కేంద్ర అటవీశాఖ పర్యావరణ శాఖలు వీకే7 ఓపెన్‌కాస్టుకు పచ్చజెండా ఊపడంతో కొత్తగూడెం ఏరియాకు మహర్దశ రానుంది.

కొత్తగూడెం ఏరియాలో బొగ్గు ఉత్పత్తి పీవీకే5 ఇంక్లైన్‌లోనే జరుగుతోంది. వీకే 7 ఓపెన్‌కాస్టు ఏర్పాటు వల్ల మరో 15 ఏళ్ల బొగ్గు ఉత్పత్తి జరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. బొగ్గు ఉత్పత్తి ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా 2వేల మంది వరకు సింగరేణి, కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయి. గత మూడేళ్ల క్రితం గౌతంఖని ఓపెన్‌కాస్టులో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోవడంతో ఆ ఓసీలో పని చేస్తున్న సుమారు 1000మంది సింగరేణి అధికారులు, కార్మికులు, డంపర్‌ఆపరేటర్లు, టెక్నికల్ సిబ్బందిని సత్తుపల్లిలోని జేవీఆర్‌ఓసీ కిష్టారం ఓపెన్‌కాస్టుకు కొంతమందిని బదిలీ చేశారు. మరికొంతమందిని డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించే విధంగా యాజమాన్యం చర్యలు చేపట్టింది. దీంతో కొత్తగూడెం, రామవరం, రుద్రంపూర్‌కు చెందిన కార్మికులంతా సత్తుపల్లికి వాహనాల ద్వారా విధులు నిర్వహించేందుకు వెళ్తున్న పరిస్థితి ఎదురవుతోంది. వీకే7 ఓపెన్‌కాస్టు అనుమతులు లభిస్తాయనే ముందస్తు చర్యలతో ఇప్పటికే సింగరేణి యాజమాన్యం ఆ ప్రాంతంలో పలు పనులను సైతం నిర్వహిస్తోంది. అనుమతులు లభించడంతో కార్మికులు, కార్మికసంఘాల నాయకులు, ఉద్యోగులు హర్షం ప్రకటిస్తోన్నారు.

ఓపెన్‌కాస్టులో ఓవర్‌బర్డెన్ పనులను నిర్వహించేందుకు సైతం టెండర్లను ఆహ్వానించినట్లు అధికారులు ప్రకటించారు. ఇప్పటికే ఓపెన్‌కాస్టు ఏర్పాటు కోసం కొత్తగూడెం నుంచి విజయవాడ వెళ్లే ప్రధాన రహదారిని సైతం మళ్లించే పనులు నిర్వహించారు. వీకే 7 ఓపెన్‌కాస్టు కోసం కొత్తగూడెం ఏరియాలో సింగరేణి యాజమాన్యం కేంద్ర పర్యావరణ అనుమతి కోసం సింగరేణి యాజమాన్యం కొత్తగూడెం ఏరియాలో ఏకోపార్కును



మైన్ మేనేజర్ కార్యాలయం

సైతం నిర్మించినప్పటికి అనుమతులు రావడం కోసం సుమారు మూడేళ్లుగా ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. సింగరేణి సీఎండీ ఎన్. బలరాం ప్రత్యేక చొరవ చూపి కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులను సమన్వయం చేసి అనుమతులు వచ్చే విధంగా శ్రమించారు. ఇప్పటికే సింగరేణిలో పలు మైన్స్ మూతపడుతున్న నేపథ్యంలో వీకే 7 ఓపెన్‌కాస్టుకు అనుమతులు లభించడం సింగరేణికి కొత్తఉత్సాహాన్ని నింపినట్లైంది. కార్మికులకు సైతం ఉపాధి అవకాశాలు పెరిగే పరిస్థితులు ఏర్పడ్డాయి. అనుమతులు రావడం పట్ల సింగరేణి సమీప ప్రాంతాల అభివృద్ధికి సైతం ఎంతో దోహదం పడుతోంది. అనుమతులకు శ్రమించిన అధికారులకు కార్మికులు అభినందనలు తెలిపారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని పెంచుతాం.. సీఎండీ బలరాం

సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని వెంకటేష్‌ఖని ఓపెన్‌కాస్టుకు అన్ని రకాల అనుమతులు లభించాయి. ఈ ఏడాది నుంచే ఓవర్‌బర్డెన్ పనులను పూర్తి చేసి బొగ్గు ఉత్పత్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఓపెన్‌కాస్టు ఏర్పాటు వల్ల సింగరేణి కార్మికులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయి. సమీప ప్రాంతాలకు సైతం ప్రయోజనం చేకూరుతోంది. పెండింగ్‌లో ఉన్న ఓపెన్‌కాస్టులను సైతం త్వరలోనే అనుమతులు తీసుకొచ్చే విధంగా పని చేస్తున్నాం. కార్మికులు సమిష్టి కృషి ద్వార సంస్థను అభివృద్ధి పథంలో నడిపేందుకు యాజమాన్యం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాల్వంచ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పాత కొత్తగూడేనికి చెందిన ముత్తోజు తిరుమలాచారి, అంబుల శ్రీకాంత్, అంథోనిలు ముగ్గురు శనివారం రాత్రి ఆటోలో ఓ ఫంక్షన్‌కు హాజరయ్యారు. ఫంక్షన్ ముగించుకుని పాల్వంచ వైపు వస్తుండగా అజాగ్రత్తగా నడపడం వల్ల పాల్వంచ మండలం జగన్నాథపురం శివారులో వారు ప్రయాణిస్తున్న ఆటో డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తాపడి ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు రోడ్డుపై పడ్డారు. అందులో తిరుమలాచారి తలకు తీవ్ర గాయలై రక్తస్రావం ఏర్పడింది. మిగిలిన ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు హుటాహుటిన వారిని పాల్వంచ వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి తిరుమలాచారిని నేరుగా వరంగల్ తరలించారు. చికిత్స పొందుతూ తిరుమలాచారి ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి ముత్తోజు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు.

ఎన్నెస్పీ కాల్వలో పడి ఒకరు..

పెనుబల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వీఎంబంజర్ వద్ద ఎన్నెస్పీ కాల్వలో స్నానానికి దిగిన లారీ డ్రైవర్ ప్రమాదవశాత్తూ నీటమునిగి మృతిచెందిన సంఘటన ఆదివారం జరిగింది. ఒంగోలు జిల్లాకు చెందిన చిమటా వెంకట్రామయ్య(45) ఆదివారం ఉదయం వీఎంబంజర్‌లోని సోమలింగేశ్వర స్వామి ఆలయం పక్కనున్న ఎన్నెస్పీ కాల్వలో స్నానం చేసేందుకు దిగాడు. ప్రమాదవశాత్తూ నీటమునిగాడు. అతడి మృతదేహం కారాయిగూడెం సమీపంలో బయటపడింది. వీఎంబంజర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుబల్లి ఆసుపత్రికి తరలించారు.

ట్యాంకర్‌ను బస్సు ఢీకొన్న ఘటనలో..

పెనుబల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వైజాగ్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న బస్సు పెనుబల్లి మండలం కొత్త లంకపల్లి వద్ద రోడ్డుపై నిలిపి ఉంచిన ట్యాంకర్‌ను ఆదివారం తెల్లవారుజామున ఢీకొంది. ఈ ప్రమాదంలో కల్లూరుకు చెందిన ఆర్టీసీ కండక్టర్ వన్నవరపు సీతారామ్‌ప్రసాద్(49) మృతిచెందారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న సీతారామ్‌ప్రసాద్ డ్యూటీ ముగించుకొని కల్లూరు వెళ్తుండగా ఆ బస్సు ఎక్కాడు. కొత్తలంకపల్లి వద్ద బస్సు ట్యాంకర్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బస్సులో ప్రయాణిస్తున్న మరో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి.

భవనం పైనుంచి పడి కార్మికుడు..

గుండాల, మార్చి30(ఆంధ్రజ్యోతి): హాస్టల్ భవనం పైనుంచి పడి ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఆళ్లపల్లి ఎస్ఐ రతీష్, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాచనపల్లి గ్రామానికి చెందిన పూనెం సతీష్(30) మామకన్ను ఆశ్రమ పాఠశాలలో దినసరి కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం వంట పనులు ముగించుకొని హాస్టల్ డాబాపై పడుకునేందుకు వెళ్లాడు. రాత్రి 10గంటల సమయంలో కిందకు దిగే ప్రయత్నంలో కాలుజారి పిట్టగోడ పైనుంచి కింద పడ్డాడు. వెంటనే విద్యార్థులు, ఉపాధ్యాయులు గమనించి 108వాహనంలో గుండాల ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సతీష్ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. కాగా మృతదేహాన్ని ఆస్పత్రిలో వదిలేసి వెళ్లడంతో హాస్టల్ సిబ్బందిపై కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉగాది పండుగ రోజున సతీష్ మృతితో కుటుంబంలో, కాచనపల్లి గ్రామంలో విషాదం అలుముకుంది. ఆళ్లపల్లి ఎస్ఐ రితీష్ కేసునమోదు చేసుకొని మృతదేహనికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. .

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సత్తుపల్లిరూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం గంగారంలో ద్విచక్ర వాహనదారుడిని లారీ ఢీకొనగా తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అశ్వారావుపేట నుంచి సత్తుపల్లి వైపుకు వస్తున్న ట్రాలీ లారీ 15వ బెటాలియన్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద రాగానే ద్విచక్ర వాహనంపై వెళ్తున్న గ్రామానికి చెందిన కోటయ్యను ఢీకొంది. ఈప్రమాదంలో కుడికాలుకు తీవ్ర గాయాలవ్వగా క్షతగాత్రుడిని 108 వాహనంలో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడి

» మూడు వేల లీటర్ల పానకం ధ్వంసం


బెల్లం పాకాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

కరకగూడెం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నాయిగూడెం పంచాయతీ కలవలనాగారం గ్రామం పరిధిలోని పెద్దవాగు పరివాహక ప్రాంతంలోని కౌలూరులో గుడుంబా స్థావరాలపై ఆదివారం కరకగూడెం ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమంగా పలు డ్రమ్ములలో నిల్వ ఉంచిన మూడు వేల టీటర్ల బెల్లం పానకంను ఎస్ఐ రాజేందర్ పట్టుకుని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వ్యాపారులు అక్రమంగా నిషేధిత బెల్లం, పటికను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని కొందరు వ్యాపారుల వద్దకు పట్టణాల నుంచి బెల్లం, పటిక వంటివి వస్తున్నట్లు సమాచారం ఉందని అన్నారు. త్వరలోనే దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమంగా గుడుంబ తయారు చేస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైటర్ దుర్గారావు, సివిల్ పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.


కాలి బూడిదైన ఇళ్లు


మంటను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కట్టుబట్టలే మిగిలాయి..

» పీరాయిగూడెంలో భారీ అగ్నిప్రమాదం

» రూ.30లక్షల మేర ఆస్తి నష్టం

దుమ్ముగూడెం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పర్ణశాల గ్రామపంచాయతీ పరిధిలోని పీరాయిగూడెంలో ఆదివారం మధ్నాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో ఆదివాసీ కుటుంబాలకు కట్టుబట్టలే మిగిలాయి. బొర్రా పాండురాజు, సోడి నాగేశ్వరావు, సోందె వెంకటి, వాగె లక్ష్మిల ఇళ్లు పూర్తిగా కాలి బూడిదవగా, కారం సోమమ్మ, వాగె లక్ష్మయ్య ఇళ్లు పాక్షికంగా దగ్ధమయ్యాయి. పాండురాజు ఇంట్లో వంట చేస్తున్న క్రమంలో గ్యాస్ లీకై నిప్పంటుకోగా, మిగతా ఐదు ఇళ్లకు మంటలు వ్యాపించాయి. పాండురాజు, సోడి నాగేశ్వరావు ఇళ్లలో గ్యాస్ సిలెండర్లు పేలి పెద్ద శబ్దాలు రావడంతో పరిసరాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పక్కనే ఉన్న సోందె వెంకటి, వాగె లక్ష్మిల ఇళ్లలో గ్యాస్ సిలిండర్లు బయటకు తేవడంతో ప్రమాద స్థాయి తగ్గింది. నాలుగు ఇళ్లలోని దుస్తులు, వంటసామగ్రి, ధాన్యం, పొలం పత్రాలు, ఆధార్‌కార్డులు, టీవీలు, ఫర్నీచర్, ఇతర పత్రాలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. వాగె లక్ష్మి ఇంట్లో రూ.5లక్షల బంగారం, సోందె వెంకటి ఇంట్లో రూ.3లక్షల నగదు కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. స్థానిక యువత తెల్లం హరికృష్ణ, తెల్లం భీమరాజు తదితరులు ప్రాథమికంగా అగ్నిమంటలను అదుపులోకి తెచ్చే యత్నం చేశారు. ఫైర్ అధికారి శ్రీనివాస్ నేతృత్వంలో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఆర్ఐ నర్సింహారావు బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సుమారు రూ.30లక్షల ఆస్థినష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశారు.

వెండి, బంగారం కాలిపోయింది...

అగ్నిప్రమాదంలో తమకు కట్టుబట్టలే మిగిలాయిన బాధితురాలు వాగె లక్ష్మి తెలిపారు. ఇంట్లో ఉన్న సుమారు రూ.5లక్షల బంగారంలో మొత్తం కాలిపోగా, కొంత దొరకలేదన్నారు. మిగిలిన బంగారం నల్లగా మాడిపోయిందని, ఏం జరుగుతుందో తెలుసుకునే లోగానే జరగాల్సిన నష్టం జరిగిపోయిందని వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకొని ఇందిరమ్మ ఇళ్లను కేటాయించడంతోపాటు కాలిబూడిదైన ఆధార్, భూమి పత్రాలను ఇప్పించాలని వేడుకున్నారు.

పండగ పూట ప్రమాదం

» ఖమ్మంలోని అపార్టుమెంట్‌లో చెలరేగిన మంటలు

» ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రాణాపాయం

» షార్ట్ సర్క్యూట్‌తోనే ప్రమాదం జరిగిందంటున్న యజమాని

ఖమ్మంక్రైం, మార్చి30(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో ఆదివారం ఉగాది పండుగ రోజు ఓ అపార్టుమెంట్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. సొంతిటి కలతో ఖమ్మం నగరంలోని బుర్హాన్‌పురంలో ఓ వ్యక్తి ఇటీవలే ఓ అపార్టుమెంట్‌లోని మూడో అంతస్తులో ప్లాటును ఈఎంఐ విధానంలో కొనుగోలు చేశాడు. గత నెలలో కుటుంబసభ్యులతో కలిసి గృహప్రవేశం కూడా చేశారు. అన్ని సమకూరిన తర్వాత ఏప్రిల్‌లో సొంతింటికి వద్దామని అనుకున్నారు. అయితే ఆదివారం ఉగాది పండగ సందర్భంగా ఆ ఇంట్లో పూజ చేసి వెళ్లారు. అయితే వారు వెళ్లిన తరువాత సుమారు గంటలోనే సదరు అపార్టుమెంట్‌లో మంటలు చెలరేగుతున్నాయని ఫోన్ వచ్చింది. నగరానికి చెందిన కొమ్మూరి సత్తిరెడ్డి అనే వ్యక్తి బుర్హాన్‌పురంలో పిన్ని ఎలైట్ హోం అపార్టుమెంట్‌లో మూడో అంతస్తులోని ఓ ప్లాటును కొనుగోలు చేశాడు. ఆ ప్లాటులో ఆదివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో దట్టమైన పొగలతో మంటలు చెలరేగడంతో అపార్టుమెంట్ సమీపంలోని మరో అపార్టుమెంట్‌లో ఉండే వంశీ అనే నివాసి గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించాడు. వెంటనే ఫైర్‌సిబ్బంది సంఘటనస్థలానికి చేరుకుని సుమారు రెండు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదం జరిగిన సమయంలో అపార్ట్‌మెంట్‌లో ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. ఉగాది సందర్భంగా పూజ గదిలో దీపం పెట్టడం వల్ల ప్రమాదం జరిగిందని సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతుండగా షార్ట్ సర్క్యూట్ వల్లనే అగ్ని ప్రమాదం జరిగిందని ప్లాట్ యజమాని సత్తిరెడ్డి తెలిపాడు. ఈ ప్రమాదంలో ప్లాటులోని తలుపులు, సీలింగ్, కబ్‌బోర్డులు, గోడలు పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.30లక్షల ఆస్తినష్టం జరిగిందని యజమాని తెలిపాడు.


అపార్ట్‌మెంట్ నుంచి దట్టమైన పొగలు వస్తున్న దృశ్యం

అక్రమంగా ఇసుక తవ్వకాలు

» చీకట్లో ట్రాక్టర్లలో అక్రమ రవాణా

» స్థానికులను బెదిరిస్తున్న వ్యాపారులు

కరకగూడెం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవాగు నుంచి, బూడిదవాగు నుంచి రాత్రి సమయంలో కొందరు దళారులు గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా ఇసుక, మట్టి దందాను సాగిస్తున్నారు. రాత్రి సమయంలో పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పరుగులు పెడుతుండగా ఆ శబ్దాలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కాగా ఇదేంటని ప్రశ్నిస్తున్న ప్రజలను ఇసుక దందాకు పాల్పడుతున్న వారు తాము అధికార పార్టీకి చెందిన వారమని, తమకెవరూ అడ్డు రాలేరని బెదిరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. రాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తోలకాలు తోలుతూ లక్షల్లో నగదు సంపాదిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అధికార పార్టీ నాయకులు అయితే వారి ఇష్టం వచ్చినట్లు పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తోలకాలు తోలవచ్చా అని ప్రజలు ప్రశిస్తున్నారు. మండల వ్యాప్తంగా రాత్రి పగలు తేడా లేకుండా అక్రమంగా ఇసుక తోలకాలు తోలుతున్న అక్రమార్కులపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ కొమరం కాంతారావు, పెసా గ్రామ కమిటీ సభ్యుడు గొగ్గలి సతీష్ డిమాండ్ చేశారు. ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేయక తప్పదని హెచ్చరించారు.

కాగా మండలంలోని పెద్దవాగు, ఒర్రెల నుంచి అక్రమంగా ఇసుక తోలకాలు, మట్టి తోలకాలు చేపడితే చర్యలు తప్పవని కరకగూడెం ఎస్ఐ రాజేందర్ స్పష్టంచేశారు. అక్రమంగా ఇసుక, మట్టి తోలితే ట్రాక్టర్ సీజ్‌తో పాటు డ్రైవర్, ఓనర్లపై కేసులు నమోదు చేస్తామన్నారు.


చీకట్లో పరుగులు పెడుతున్న ఇసుక ట్రాక్టర్

వింత వ్యాధితో 13 పాడి గేదెల మృత్యువాత

» ఆందోళనలో రైతులు

» ఎటువంటి నిర్ధారణకు రాని వైద్యులు

పాల్వంచటౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వింత వ్యాధితో 13 పాడి గేదెలు మృత్యువాత పడిన సంఘటన పాల్వంచ మునిసిపాలిటీ పరిధిలోని పిల్లవాగులో ఆదివారం చోటు చేసుకుంది. కేవలం గంటల వ్యవధిలోనే ఒక్కక్కటిగా గేదెలు మృతి చెందుతుండటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. శనివారం సాయంత్ర నుంచి ప్రారంభమైన గేదెల మృతి 13కు చేరుకుంది. సుమారు ఒక్కో గేదె రూ.70 నుంచి రూ.80 వేలు ఉంటుందని గిరిజన రైతులు వాపోతున్నారు. మృతి చెందిన వాటిలో ఊకే రాంబాబుకు చెందినవి-3, ఊకే భద్రయ్య-3, వర్సా వెంకటేశ్వర్లు-3, కుంజా ఆదెమ్మ-2- , ఊకే బెల్లెమ్మ-2 ఉండటంతో వాటిని స్థానికంగా ఖననం చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ప్రభుత్వ పశువైద్యాధికారి ప్రాథమిక విచారణ చేసినప్పటికీ, గేదెలు తాగిన నీరు, మేత మేసిన చేలను పరిశీలించినప్పటికీ ఎటువంటి నిర్ధారణకు రాకపోవడంతో స్థానికుల్లో ఆందోళన మరింతగా పెరిగింది. స్థానికులు గ్రామంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి గేదెల మృతిని అరికట్టాలని వారు కోరుతున్నారు. గేదెల మృతితో తమ జీవనాధారం కోల్పోయామని, ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని గిరిజన రైతులు కోరుతున్నారు.


మృత్యువాత పడిన గేదె

తొలి ప్రయత్నంలోనే గ్రూప్-1లో మెరిసిన లక్ష్మీసాహితి

» రాష్ట్రస్థాయిలో 129, మల్టీజోన్-1లో 69ర్యాంకు



వైరా, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ 9వ వార్డులోని సంగెపు లక్ష్మీసాహితీ ఆదివారం వెలువడిన గ్రూప్-1 ర్యాంకుల జాబితాలో రాష్ట్రస్థాయిలో 129వ ర్యాంకు, మల్టీజోన్-1లో 69ర్యాంకు సాధించింది. బీసీ-బీ సామాజిక వర్గానికి చెందిన లక్ష్మీసాహితీకి గ్రూప్-1 పరీక్షల్లో 483.5మార్కులు లభించాయి. వైరాలో మధ్యతరగతి కుటుంబానికి చెందిన సంగెపు వెంకటేశ్వరరావు, కవిత దంపతుల కుమార్తె లక్ష్మీసాహితీ ఆమెకు సోదరుడు అచ్యుతసాయి ఉన్నాడు.

సివిల్స్ సాధించటమే లక్ష్యం..

గ్రూప్-1లో ర్యాంకు సాధించినా తన అంతిమ లక్ష్యం సివిల్స్ సాధించటమేనని లక్ష్మీసాహితీ తెలిపింది. తాను 8వ తరగతిలో ఉన్న సమయంలోనే అప్పటి ఖమ్మం జిల్లా కలెక్టర్ సిద్దార్థ జైన్‌ను చూసి సివిల్స్‌పై మక్కువ ఏర్పడిందని పేర్కొంది.

సంకల్పించి.. కొలువులు సాధించి..


ఇమ్మాన్యుయేల్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి చెందిన దాసరి మైకేల్ ఇమ్మాన్యుయేల్ చిన్న వయస్సులోనే రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి శభాష్ అనిపించుకున్నాడు. గ్రూప్-1లో 1,373 ర్యాంకు సాధించి ప్రభుత్వ కొలువుకు అర్హత సాధించాడు. దాసరి మైకేల్ ఇమ్మాన్యుయేల్ రాజ్ ఖమ్మంలోని ఇల్లెందు రోడ్డు సమీపంలోని అమరావతి నగర్‌లో ఉంటున్నాడు. గత ఏడాది నిర్వహించిన గ్రూప్-3 పరీక్షల్లో మంచి మార్కులు సంపాదించిన మైకేల్ ఇమ్మానియేల్ రాజ్ ప్రభుత్వ ఉద్యోగాన్ని సంపాదించాడు. ప్రస్తుతం తాను వరంగల్ జిల్లా డోర్నకల్‌లో తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తండ్రి రవికిరణ్ ప్రోత్సాహంతో గ్రూప్1కి సన్నద్ధం అయ్యాడు. అంతే కాదు కుమారుడు ఇమ్మానియేల్, కూతురు షరీనాగిఫ్టీతో కలిసి రవికిరణ్ ముగ్గురు కలిసి ఈ ఏడాది గ్రూప్1 పరీక్షలకు సన్నద్ధం అయి రాసారు. అయితే ఈ పరీక్షల్లో తండ్రీకొడుకు ఇద్దరూ ప్రిలిమ్స్‌లో ఎంపికయ్యారు. కానీ రవికిరణ్ మెయిన్స్‌కు వచ్చే సరికి అర్హత సాధించలేక పోయాడు. కొడుకు ఇమ్మానియేల్ మాత్రం 429.55 మార్కులు సాధించి 1373 ర్యాంకును సాధించాడు. దీంతో ఆ ఇంట్లో ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

ఆరేళ్ల కృషి ఫలితం.. గ్రూప్-1 ర్యాంక్


రాహుల్

తల్లాడ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆరు సంవత్సరాల కృషి, పట్టుదల ఫలించిందని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా సివిల్స్ సాధించాలన్నదే తన జీవిత లక్ష్యమని గ్రూప్-1కు ఎంపికైన తల్లాడకు చెందిన చింతా రాహుల్ అన్నారు. రాహుల్ గ్రూపు-1లో 467.5మార్కులతో రాష్ట్రస్థాయిలో 264వ ర్యాంకు, మల్టీజోన్‌లో 115వ ర్యాంకు సాధించి డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. బీటెక్ పూర్తయిన తర్వాత సివిల్స్ లక్ష్యంతో 2019వ సంవత్సరంలో ఢిల్లీలో వాజీరామ్ రవిలో శిక్షణ కోసం వెళ్లి కొవిడ్ కారణంగా అక్కడి నుంచి తిరిగొచ్చాడు. తిరిగి 2022 అక్టోబరు నుంచి 2023 అక్టోబరు వరకు ఢిల్లీలో వాజీరామ్ రవిలో శిక్షణ తీసుకొని యూపీఎస్సీ ప్రిలిమ్స్ రాశాడు. ఫలితం దక్కకపోవడంతో నిరాశ చెందలేదు. పట్టుదలతో గ్రూప్-1 తొలిసారి రాసి విజయం సాధించాడు. రాహుల్ తండ్రి రాజు ఉపాధ్యాయుడిగా, తండ్రి చంద్రకళ గృహిణిగా ఉన్నారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ ఉద్యోగాన్ని దైవంగా భావించి ప్రజలకు సేవ చేస్తానన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే గ్రూప్-1కు ఎంపికయ్యానని తెలిపాడు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి..



నేలకొండపల్లి, మార్చి30 (ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి మండలం మండ్రాజుపల్లికి చెందిన నెల్లూరి సింధు గ్రూప్స్1,2,3,4లో ఉద్యోగాలు సాధించింది. సింధు ప్రస్తుతం గ్రూప్-4లో వచ్చిన వార్డు అధికారిగా ఖమ్మం మున్సిపాలిటీలో పని చేస్తోంది. అంతకు ముందు గ్రూప్-2లోఎంపీవో పోస్టుకు, గ్రూప్-3లో సీనియర్ అకౌంటెంట్ పోస్టుకు ఎంపికైంది. ఆదివారం ప్రకటించిన గ్రూప్-1లో మల్టీజోన్ మహిళా విభాగంలో 64వర్యాంకు, రాష్ట్రస్థాయిలో 176వ ర్యాంకును సాధించింది. ఈడీఈగా పని చేయాలనుందని సింధు ఆశాభావం వ్యక్తం చేసింది. గ్రూప్స్ సాధించాలన్న పట్టుదలతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి, కోచింగ్ తీసుకున్నట్లు సింధు తెలిపింది. తాను సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసినా, గ్రూప్స్‌కు తయారువుతానన్నా తన భర్త కిరణ్ ఎటువంటి అభ్యంతరం పెట్టక పోగా పూర్తిగా సహకరించినట్లు చెప్పింది. గ్రూప్స్‌కు ఎక్కడ కోచింగ్ బాగుంటుందో అంతా తన భర్త చూసాడని, మంచి కోచింగ్ సెంటర్లో కోచింగ్ తీసుకునేలా ప్రోత్సహించినట్లు చెప్పింది. గతంలో రెండు సార్లు పేపర్ లీక్ గావటంతో కష్టపడి చదివిందంతా బూడిదలో పోసిన పన్నీరైందని బాధపడినట్లు చెప్పింది. గ్రూప్స్‌లో ర్యాంకు సాధించాలన్న కోరిక నెరవేరిందని, భర్త, తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సహించారని చెప్పింది.



అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలు

తిరుమలాయపాలెం, మార్చి30(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం అసువులు బాసిన అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలు చేపడతామని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను తెలిపారు. ఆదివారం మండలంలోని పిండిప్రోలులో సీపీఎం మండల సీనియర్ నేత గజ్జల వెంకటయ్య వర్ధంతి సభలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వెంకటయ్య సీపీఎం విస్తరణకు ఎనలేని కృషిచేశారన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడి వాటిని పరిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో పద్మనాభుల సుధాకర్, పప్పుల ప్రసాద్, రామనబోయిన రవి, పిట్టల పాపారావు, దాసరి మహేందర్, వెంకటేష్ పాల్గొన్నారు.

అభయమిచ్చే వేంకటేశుడు



అభయ వేంకటేశ్వర స్వామి

- స్వయం భూగా వెలసిన స్వామివారు
- ముడుపులు, ప్రదక్షిణ ఇక్కడి ప్రత్యేకత

ఖమ్మం ఖానాపురం హవేలి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం ఖానాపురం యూపీహెచ్ కాలనీలో స్వయంభువుడిగా వెలసిని శ్రీ అభయ వేంకటేశ్వర స్వామి భక్తుల కోరికలు తీరుస్తూ కొంగు బంగారంగా పూజలందుకుంటున్నారు. ఎంతో క్షేత్ర ప్రాశస్త్యంతో కలిగిన ఈ ఆలయం ఉన్న ప్రాంతంలో నిత్యం ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తుంటుంది. 2004 మార్చి 20వ తేదీన యూపీహెచ్ కాలనీలో ఉండే రెబ్బలపల్లి రాజ్యలక్ష్మి అనే భక్తురాలికి కలలో వేంకటేశ్వర స్వామివారు కనిపించారు. తాను ఉన్న స్థలాన్ని తెలిపారు. ఆ స్థలంలో రాయి మీద స్వామి వారి నామాలు, శంకుచక్రాలు, అభయ హస్తం ఎంతో స్పష్టంగా కనిపించాయి. వెంటనే స్థానికులు, పెద్దలతో మాట్లాడి అక్కడికక్కడే స్వామి వారికి పందిరి ఏర్పాటు చేయించారు. 2005వ సంవత్సరంలో అభయ వేంకటేశ్వర స్వామి గుడి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2008 ఏప్రిల్ 30న స్వామి వారి విగ్రహ ప్రతిష్టమహోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. మొత్తం 840 గజాల స్థలంలో ఆలయాన్ని నిర్మించారు. 2008 జూన్ 7న 58 మందితో అన్నదానం ప్రారంభించారు. ప్రతీ శనివారం 900 మందికి అన్నదానం చేస్తున్నారు. ఈ ఆలయాన్ని కుర్తాళం పీఠపాలిత శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామికి అనుసంధానంగా ఏర్పాటు చేశారు. ఈ ఆలయాన్ని వైఖానస దివ్యక్షేత్రంగా పిలుస్తున్నారు. 2008 నుంచి ఏటా స్వామి వారి బ్రహ్మోత్సవాలను కనులపండుగగా నిర్వహిస్తారు. ప్రతి శనివారం స్వామి వారి శాంతి కల్యాణం నిర్వహిస్తుంటారు. భక్తులు ఏదైనా మనసులో అనుకుని 11 ప్రదక్షిణలు చేసి ఆలయంలో ముడుపు చెల్లిచడం ఆనవాయితీ వస్తోంది. అనుకున్న కోరిక తీరిన తరువాత 108 ప్రదక్షిణలు చేస్తుంటారు.



అభయ వేంకటేశ్వరస్వామి ఆలయం



ఆలయ ప్రాంగణంలోని గోశాల

స్వామి కలలో కనిపించటం నా అదృష్టం

రెబ్బపల్లి రాజ్యలక్ష్మి, భక్తురాలు



స్వామి కలలో కనిపించటం నా అదృష్టంగా భావించా. కొందరు స్థానికులతో కలిసి స్వామి వెలసిన ప్రాంతానిక చేరుకోని చూడగా ఓ పెద్ద రాయి బండపై స్వామి పసుపురంగు ఆకరంలో నామాలు, శంకుచక్రాలు, అభయ హస్తం ఎంతో స్పష్టంగా కనిపించాయి.

ముక్కోటి ఏకదశి పూజలు ప్రత్యేకం

నరగిరినాథుని రామాచార్యులు, ప్రధాన అర్చకుడు



అభయ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకదశి పూజలు ప్రత్యేకంగా జరుగుతాయి. ఇక్కడ స్వామి ఉత్తర దిశగా వెలిశారు. దీంతో భక్తులకు రోజు ఉత్తర దిశగా దర్శనమిస్తారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

బొల్లి. కొమరయ్య, ఆలయ అధ్యక్షుడు



ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు ఏర్పాటు పూర్తి చేశాం. ఆగమన శాస్త్ర ప్రకారం ఉత్సవాలు నిర్వహిస్తాం. ఈ ఏడాది ఉత్సవాల్లో 300ల మంది కళాకారులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. 15 వేల మంది వరకు మహా అన్నదానం నిర్వహిస్తున్నాం.

వ్యవసాయ అధికారులకు కొత్త ఫోన్‌నెంబర్లు

ఖమ్మం వ్యవసాయం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో పనిచేసే వ్యవసాయ శాఖలోని అన్ని విభాగాల అధికారుల ఫోన్ నెంబర్లు మారినట్లు జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య ఆదివారం తెలిపారు. గతంలో అందరి వద్దా 7సిరీస్‌తో ఉన్న ఒడాఫోన్ కంపెనీ నెంబర్లు ఉండేవని, ప్రస్తుతం వాటిని మార్చినట్లు తెలిపారు. కొత్తగా 8 సిరీస్‌తో ఉన్న ఎయిర్‌టెల్ కంపెనీ ఫోన్ నెంబర్లు వాడుకలోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. రైతులు తమ సమీపంలోని అధికారుల వద్ద కొత్త నెంబర్లను తీసుకోవాలని ఆయన సూచించారు.

నడక సాధకులకు ఉగాది పచ్చడి పంపిణీ

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): శీతల పానీయాలు మానండి, సహజ పానీయాలు తాగండి అంటూ ఉగాది పండుగ సందర్భంగా జన విజ్ఞాన వేదిక ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నగరంలోని పెవిలియన్ మైదానంలో నడక సాధకులకు ఉగాది పచ్చడిని అందించారు. శీతల పానీయాలు వలన జరిగే నష్టాలను వివరించి, కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా బాధ్యులు మోహన్, రామారావు, శివన్నారాయణ, సూర్యనారాయణ, డాన్‌బోస్కో పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో ఉగాది



చీరలు పంపిణీ చేస్తున్న నున్నా

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): సీపీఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య భవన్‌లో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది పచ్చడి చేయటంతో నాయకులు సేవించారు. బోడేపూడి విజ్ఞాన కేంద్రం మెనేజరు వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహిళలకు చీరలు అందించగా వాటిని జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పంపిణీ చేశారు. డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, రాష్ట్ర నాయకులు యర్రా శ్రీకాంత్, మాదినేని రమేశ్, ఎం సుబ్బారావు, బండారు రమేశ్, ఝాన్సీ, బషీర్, దొంగల తిరుపతిరావు, మీరా సాహెబ్, భూక్య శ్రీనివాసరావు, బోడపట్ల సుదర్శన్, బండారు యాకయ్య పాల్గొన్నారు.

తిరుమలాయపాలెంలో వేడుకలు

తిరుమలాయపాలెం: ఉగాది వేడుకలను ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించారు. మండలంలోని కాకరవాయి, సుబ్లేడు, బీరోలు, బచ్చోడు, దమ్మాయిగూడెం, పిండిప్రోలు, తిరుమలాయపాలెం, రఘునాథపాలెం, కొక్కిరేణి తదితర గ్రామాల్లో ఉగాదివేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుబ్లేడు రామాలయంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, ఓర వెంకటేశ్వర్లు, రామడుగు ప్రభాకరరావు, సుమన్‌రెడ్డి తదితరులు పూజలు చేశారు. అలాగే రైతులు గోమాతలకు పూజలు చేశారు.ప్రతీ ఇంటిలో కూడా మామిడితోరణాలు కట్టారు.

ప్రజలకు సేవ చేసేందుకే జోనల్ వ్యవస్థ

తొలి జోనల్ కార్యాలయాన్ని ప్రారంభించిన మేయర్

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం మహానగరంగా విస్తరణ జరుగుతున్న క్రమంలో ప్రజల వద్దకే పరిపాలన అందించేందుకు సత్వర పౌరసేవలను అమలు చేసేందుకు ఖమ్మం నగరాన్ని ఐదు జోన్‌లుగా విభజన చేసి జోనల్ వ్యవస్థను నిర్మాణం చేయటం జరిగిందని ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం మున్సిపల్ కార్యాలయంలో తొలి జోనల్ కార్యాలయాన్ని డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో ఐదు లక్షలకు పైగా జనాభా పెరిగిందని, విలీన ప్రాంతాలు అభివృద్ధి చేసేందుకు ఆయా ప్రాంతాల ప్రజలు కేఎంసీ కార్యాలయానికి రాకుండా సమీపంలోనే జోనల్ కార్యాలయాలు నిర్మాణం జరుగుతుందన్నారు. నార్త్, ఈస్ట్, వెస్ట్, సౌత్, సెంట్రల్ ఇలా ఐదు జోన్‌లుగా ఖమ్మం నగరంలో కార్యాలయాలు ఏర్పాటు జరుగుతుందన్నారు. ప్రతి 90 నుంచి లక్ష జనాభాకు ఒక కార్యాలయం ఏర్పాటు వల్ల ప్రజలు స్థానికంగా అందుబాటులో ఉన్న కార్యాలయంలో సేవలు పొందుతారని వివరించారు. ముందుగా ఖమ్మం పాత మున్సిపల్ కార్యాలయంలో వెస్ట్ జోన్ ప్రారంభం జరిగిందని మరో వారం రోజుల్లోగా మిగిలిన కార్యాయాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ ప్రతి జోనల్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, ఇంజనీరింగ్, పారిశుధ్యం, ఇతర విభాగాల పర్యవేక్షకులు ఉంటారని తెలిపారు. ప్రతి జోన్ కార్యాలయంలో 14 మంది వరకు పర్యవేక్షక ఉద్యోగులను కేటాయింపు చేశామన్నారు. ఐదు జోనల్ కార్యాలయాలను ఖమ్మం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి అనుక్షణం పర్యవేక్షణ జరుగుతుందని, కార్పొరేటర్లు, ప్రజలకు స్థానికంగా సేవలు అందించేందుకు మహానగరాల స్థాయిలో ఖమ్మంలో జోనల్ వ్యవస్థకు ఉగాది పర్వదినోత్సవం నుంచి ప్రారంభించామన్నారు. ప్రజలకు మెరుగైన పారదర్శకమైన సేవలు అందించేందుకు కేఎంసీ విభాగాల అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం జోనల్ కార్యాలయంలో మేయర్ పునుకొల్లు నీరజ అధికారులతో తొలి సమావేశం నిర్వహించారు. ప్రజలకు స్థానికంగా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఏఎంసీ షఫీ ఉల్లా, ఈఈ కృష్ణలాల్, డీఈ ధరణి , మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతారాణి, ఎన్విరాన్‌మెంట్ ఏఈ శ్రీనివాస్, ఏఈ తేజా, సీసీలు పవన్, వీరబాబు, పీఆర్వో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



జోనల్ కార్యాలయం..



జోనల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మేయర్

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ చేపట్టాలి



ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ మృతికి శాంతి చేకూరాలని ఆదివారం రాత్రి నగర క్రైస్తవులు ఫెలోషిప్ ఆధ్వర్యంలో పెవిలియన్ గ్రౌండ్ నుంచి ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించి, కొవొత్తులతో ఘన నివాళి అర్పించారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం విచారణ నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సేవకులు రమేష్‌బాబు, ఆనంద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

లౌకిక తత్వాన్ని కాపాడే ప్రభుత్వం

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలోకి వచ్చినా కుల, మతాలకు అతీతంగా పరిపాలన సాగిస్తూ ప్రజాస్వామ్యయుతంగా లౌకిక తత్వానికి కట్టుబడి ఉంటుందని, ఖమ్మం నగరంలో హిందు ముస్లింలు సోదరభావంతో ఉంటారని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. రంజాన్ సందర్భంగా 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న ఆధ్వర్యంలో ముస్లీం కుటుంబాలకు రంజాన్ తోఫా ఏర్పాటు చేశారు. వాటిని రాయల నాగేశ్వరరావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేటర్ దంపతులను అభినందించారు. కుల మతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు చేయటం మంచి పరిణామంగా పేర్కొన్నారు. జిల్లా మైనార్టీ అధ్యక్షులు హుస్సేన్, ఆశ్రిఫ్, సింగం అంజయ్య, కాటం కొమరయ్య, దేవర వెంకటన్న, శనిగరం ఉప్పలయ్య, నాగేశ్వరరావు, కాటం యాదయ్య, అచ్చిని వెంకటేశ్వర్లు, గొనెల రవిశంకర్, చంద్రమ్మ, ఉపేంద్రమ్మ, గొనెల సునీత, చల్లా రమేశ్, మీరా సాహెబ్, అజిజుల్లాబేగ్, మస్తాన్, కన్నం రమేశ్, కేసోజు వీరాచారి, బుంగ శ్రీనివాస్, ఎరుకనబోయిన వెంకటేశ్వర్లు, జానీమియా, పగిళ్ల బుచ్చిబాబు, వేముల విజయ్, నజీర్, బొలక్క శ్రీను, కెమిడి యాదగిరి, గర్దకోటి కిషన్, జగదీష్, సెల్వం జ్ఞానేశ్వర్, సంతోష్ పాల్గొన్నారు.



రంజాన్ తోఫా అందజేస్తున్న దృశ్యం

ముస్లింలకు పెద్దపీట



కార్యక్రమంలో పాల్గొన్న దయాకర్‌రెడ్డి

ఖమ్మం రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ముస్లీం, మైనార్టీలకు పెద్దపీట వేస్తుందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని తెల్దారుపల్లి గ్రామంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు తమ్మినేని నవీన్ ముస్లింలకు ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి తుంబూరి దయాకర్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను పెద్ద ఎత్తున అందజేస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తమ్మినేని మంగతాయి, గ్రామ కాంగ్రెస్ నాయకులు, ముస్లీం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి తీరుస్తున్న చలి వేంద్రాలు



ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత పెరిగి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదు అవుతున్నాయి. పల్లెల నుంచి పట్టణాలకు వచ్చిన ప్రజలతో పాటుగా నగరంలో పలు పనుల కోసం బయటకు వచ్చిన వారికి మంచినీళ్లు కావాలంటే డబ్బులు వదలాల్సిందే. అయితే ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఖమ్మం నగరంలో జన సంచారం అధికంగా ఉండే ప్రధాన రహదారులు, వాణిజ్య కేంద్రాలు, కూడళ్లపై సర్వే చేయించి గుర్తించారు. 40 ప్రాంతాలను గుర్తించి వాటిలో చలి వేంద్రాలను ఏర్పాటు చేశారు. దాహంతో ఉన్న వారు ఆకట్టుకునేలా పరిశుభ్రమైన ప్రదేశాల్లో మట్టి కుండలతో హట్‌ల నిర్మాణం చేశారు. ఒక్కో చలివేంద్రంలో నాల్గు కుండలను ఏర్పాటు చేసి వాటిలో నీటిని ఎప్పటికప్పుడు ఉంచే బాధ్యతలను ప్రత్యేకంగా ఉద్యోగులకు కేటాయించారు. వాటర్ సప్లయ్ లైన్‌మ్యాన్‌లకు చలి వేంద్రాల నిర్వాహణను కేటాయించారు. దీంతో పల్లెల నుంచి పట్టణాలకు వచ్చిన ప్రజలతో పాటుగా ఆటో డ్రైవర్లు, నగరంలో వాహనదారులు, పాదచారులు చల్లటి మంచినీళ్లు తాగుతున్నారు.

పలు చోట్ల పంచాంగ శ్రవణాలు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): శ్రీ విశ్వావసు నామ నూతన సంవత్సరం ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం కార్యక్రమాలు నిర్వహించారు. కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో నగరంలోని స్వర్ణభారతి కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. రాజశేఖర్ సిద్ధాంతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లు రఘు సత్యనారాయణ, చావా రాము దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పంచాంగ శ్రవణం నిర్వహించి. రైతులను సన్మానించారు. కార్యక్రమంలో టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి. శ్రీనివాసరావు, తాళ్లూరి జయశేఖర్, గరికపాటి. వెంకటేశ్వరరావును సన్మానించారు.





కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో, జలాంజనేయ స్వామి గుడిలో

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

నేలకొండపల్లి, మార్చి30(ఆంధ్రజ్యోతి): బ్యాంకు పనిపై వచ్చే ఖాతాదారులు, వివిధ రకాల పనులపై నేలకొండపల్లి మండల కేంద్రానికి వచ్చే ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ సత్యనారాయణ కోరారు. భక్తరామదాసు సర్వీస్ సొసైటీ, నేలకొండపల్లి భారతీయ స్టేట్ బ్యాంకు పక్కన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్బీఐ ఫీల్డ్ ఆఫీసర్ ఎన్‌వీవీ సత్యనారాయణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సర్వీస్ సొసైటీ ఏర్పాటు చేసిన చలివేంద్రంలో చల్లని తాగునీటితో పాటుగా చల్లని మజ్జిగను అందించనున్నారన్నారు. చల్లని తాగునీటితో పాటుగా మజ్జిగను అందిస్తున్న భక్తరామదాసు సర్వీస్ సొసైటీని ఫీల్డ్ ఆఫీసర్ అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఏటుకూరి ప్రకాశరావు(రామారావు), కార్యదర్శి గెల్లా వెంకటరమణగుప్తా, కోశాధికారి దండా రవీంద్రబాబు, ఉపాధ్యక్షుడు తెల్లగొర్ల లింగస్వామి, మాజీ అధ్యక్షులు యలమద్ది లెనిన్, గెల్లా జగన్మోహన్ రావు, వి.భాస్కరరావు, కార్యవర్గసభ్యులు వాసం లక్ష్మయ్య, నంజర్ల దేవీప్రసాద్, పచ్చా తిరుపతయ్య, చావా గణపతిరావు, భవనాశి దుర్గారావు, రాయల రమేష్, యర్రా సైదయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
గత 40 సం॥లుగా TGNPDCLలో అంకిత భావంతో పనిచేసి, సంస్థలో విశిష్ట సేవలు అందించి, అందరి మన్ననలు పొందిన మాకు మార్గదర్శకురాలు, మా ఉన్నతికి కారకులైన మా అమ్మగారు శ్రీమతి భుంపటి తిరుపతమ్మ గారు నేడు ఉద్యోగ విరమణ చేయుచున్న శుభసందర్భంగా వారు అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో గడపాలని మనసారా కోరుకుంటూ...
శ్రీమతి భుంపటి తిరుపతమ్మ గారు
Record Assistent, TGNPDCL
DE / OP / KHAMMAM
భర్త: రామమూర్తి (లేటు)
కుమారుడు - కోడలు: భుంపటి నరసింహారావు - జ్యోత్స్న
మనుమరాలు: సాయి మౌక్తిక మనుమడు: రిత్విక్ సాయి
కుమార్తె - అల్లుడు: పిండిప్రోలు పద్మజ - శ్రీనివాస్
మనుమరాళ్ళు: రమ్య, విద్య

ఆంధ్రజ్యోతి
దినపత్రిక ద్వారా మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి, అందుకు మీ ప్రాంతంలోనే మా ప్రకటనల ప్రతినిధి అందుబాటులో ఉన్నారు సంప్రదించండి.
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
శుభాకాంక్షలు కృతజ్ఞతలు
వివాహ జన్మదిన శుభాకాంక్షలు
శ్రద్ధాంజలి పదవీ విరమణ ప్రకటనలకు 25% | EP 15% రాయితీ కల్పిస్తుంది.
లీగల్ ప్రకటనలు
క్లాసిఫైడ్స్ 4+1 స్కీము కలదు
శ్రద్ధాంజలి వర్ధంతి
ఆంధ్రజ్యోతి ప్రకటనల కోసం సంప్రదించవలసిన నెంబర్లు
ఖమ్మం: 9985401672
9985406151 9985401698
భద్రాచలం: 9985411347 | కొత్తగూడెం: 9985400885

ఖమ్మం రహదారులకు మొబైల్ వాక్యూమ్

- పారిశుధ్యంపై పోరుకు జటాయువులు
- రెండు వాహనాల ట్రయల్ రన్ పూర్తి
- ఎప్పటి చెత్త అప్పుడే తొలగింపు



ట్రయల్ రన్‌ను పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వాహణకు ఇప్పటి వరకు కార్మికులు, లేదా స్వీపింగ్ మిషన్లు మాత్రమే మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలు వినియోగించాయి. కానీ ఆధునికంగా అందుబాటులోకి వచ్చిన మొబైల్ క్లీన్ వాహనాలు ఖమ్మం నగర పాలక సంస్థకు చేరాయి. ఇప్పటికే మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆధ్వర్యంలో ట్రయల్ రన్ పూర్తి కాగా ఇక రంగంలోకి దిగటమే తర్వాయిగా ఉన్నాయి.

కేఎంసీకి రెండు జటాయులు

మహారాష్ట్రలోని పూణే మహనగరంలో ప్రధాన రహదారులు, కూడళ్లలో చెత్త కనిపించదు. ఎందుకంటే అక్కడ జటాయు పారిశుధ్య వాక్యూమ్ యంత్రాలను వినియోగిస్తున్నారు. ప్రధాన రహదారుల కూడళ్ల వెంట జటాయు మిషన్లు రవాణా చేస్తే రహదారి, కూడళ్లలో పడిన ప్లాస్టిక్ వ్యర్థాలు, పేపర్లు, కవర్లు, ఇతర డంపింగ్ వ్యర్థాలను తక్షణమే జటాయు వాక్యూమ్ క్లీనింగ్ యంత్రాలు వాక్యూమ్ ద్వారా వాటిని మిషన్‌లోకి తీసుకుంటున్నాయి. తర్వాత వాటిని డంపింగ్‌యార్డులో పారపోస్తాయి. జటాయువు డ్రైనేజీలో పేరుకు పోయిన వ్యర్థాలను కూడా పది అడుగుల లోతు వరకూ వెళ్లి.. బయటకు లాగేస్తుంది. ఇదే స్ఫూర్తితో ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు రెండు జటాయు యంత్రాలు కొనుగోలు చేశారు. ఒక్కో వాహనానికి రూ.60 లక్షలు వ్యయం చేశారు. ట్రయల్ రన్ పూర్తి చేసి రహదారులపై చెత్తను వాక్యూమ్ చేసేందుకు సిద్దంగా ఉన్నాయి. వీటి కోసం కమిషనర్ అభిషనర్ అగస్త్య కొంతమంది ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. వాటి పర్యవేక్షణకు ఒక ఇంజనీరింగ్ అధికారిని నియామకం చేశారు. వీరి పర్యవేక్షణలో జటాయువు వినియోగం జరగనుంది.



పారిశుధ్య పరిరక్షణకు సిద్ధమైన జటాయువు

వైరా నేతలకు 'డీలిమిటేషన్' ఫీవర్

» నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణపై జోరుగా చర్చలు
» 2028 ఎన్నికలు కొత్త నియోజకవర్గాల్లోనే జరుగుతాయని అంచనాలు
» అప్పుడే మారుతున్న రాజకీయ సమీకరణాలు



వైరా, మార్చి30(ఆంధ్రజ్యోతి): వైరా అసెంబ్లీ(ఎస్టీ) నియోజకవర్గంలో పలువురు నేతలకు డిలిమిటేషన్ భయం పట్టుకుంది. ఈ నియోజకవర్గం ఏర్పడి వచ్చే సాధారణ ఎన్నికల నాటికి 20సంవత్సరాలు పూర్తవుతున్నందున రిజర్వేషన్ మారే అవకాశాలు ఉన్నాయనే భావనతో ఇప్పటివరకు ఇక్కడ ప్రాతినిథ్యం వహిస్తున్న సామాజిక వర్గానికి చెందిన నేతల్లో వణుకు మొదలైంది. దాంతో కొంతకాలంగా వైరా నియోజకవర్గంలోని కొన్ని మండలాలపై ఆవర్గంలోని నేతలు శీతకన్ను వేశారనే భావన వ్యక్తమవుతుంది. డిలిమిటేషన్ తర్వాత తాము ప్రాతినిథ్యం వహించే అవకాశముందని భావిస్తున్న మండలాలపైనే అన్ని పార్టీలకు చెందిన ఆ సామాజిక వర్గం నేతలు మక్కువ చూపుతున్నారనే చర్చ కూడా నడుస్తోంది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనను మాత్రమే కోరుతుంది. గురువారం రాష్ట్ర అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఎంపీ నియోజకవర్గాల డిలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అదే సమయంలో ప్రస్తుతం ఉన్న 119అసెంబ్లీ నియోజకవర్గాలను 153కు పెంచుతూ డిలిమిటేషన్ చేయాలని కోరారు.

వైరా ఎస్టీ నియోజకవర్గం 2007లో నియోజకవర్గాల పునర్విభజనలో ఏర్పడింది వైరా, కొణిజర్ల, ఏన్కూరు, జూలూరుపాడ్, కారేపల్లి మండలాలతో ఈ నియోజకవర్గ ఆవిర్భావం జరిగింది. అంతకముందు మధిర నియోజకవర్గంలో ఉన్న వైరా మండలాన్ని అలాగే సుజాతనగర్, ఇల్లెందు, ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న జూలూరుపాడ్, ఏన్కూరు, కారేపల్లి, కొణిజర్ల మండలాలతో ఎస్టీ నియోజకవర్గంగా ఏర్పాటుచేశారు.

నాడు యూపీఏ ప్రభుత్వంలో చక్రం తిప్పిన ఓ కేంద్రమంత్రి ఉమ్మడి ఖమ్మంజిల్లాలో రాజకీయ ఆధిపత్యాన్ని చెలాయించేందుకుగానూ ఏకంగా వైరా నియోజకవర్గ రిజర్వేషన్ స్థితినే మార్చేవిధంగా ప్రభావితం చేశారనే చర్చ కూడా ఉంది. వైరా నియోజకవర్గానికి తొలిసారి 2009లో ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒక ఎంపీ సీటుకు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజన చట్టం ప్రకారం ఈ తెలుగు రాష్ట్రాల్లో ఒక ఎంపీ స్థానానికి తొమ్మిది అసెంబ్లీ నియోజకవర్గాలను ఏర్పాటుచేసుకొనే వెసులుబాటు కల్పించింది. అంటే దీని ప్రకారం తెలంగాణలో 17ఎంపీ స్థానాలున్నందున ప్రస్తుతం ఉన్న 119అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 153నియోజకవర్గాలకు పెరగనున్నాయి.

2023 అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నాటి నుంచే నియోజకవర్గాల పునర్విభజన, వైరా నియోజకవర్గంలో చేర్పులు, మార్పులు, రిజర్వేషన్ మార్పు వంటి ఆలోచనలతో ఒక సామాజిక వర్గం వారు మైదాన ప్రాంతంలోని మండలాల్లో నామమాత్ర పర్యటనలు చేస్తున్నారనే చర్చ కొనసాగుతుంది. ఇప్పటికీ వైరా నియోజకవర్గంలో 2009, 2014, 2018, 2023లో ఎన్నికలు జరిగాయి. ఇప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 నాటికి అంటే నియోజకవర్గాల పునర్విభజన జరిగిన 20ఏళ్లకు మళ్లీ రాష్ట్రంలో కొత్త నియోజకవర్గాల ఏర్పాటుతోపాటు వైరా నియోజకవర్గంలో చేర్పులు, మార్పులు సంభవిస్తాయని, 2028లో మారిన నియోజకవర్గంలోని రిజర్వేషన్‌తోనే ఎన్నికలు జరుగుతాయనే భావనలోకి ఒక సామాజిక వర్గానికి చెందిన అధికార, ప్రతిపక్ష, ఇతర పార్టీల నాయకులు వచ్చారని సర్వత్రా చర్చ కొనసాగుతుంది. దానిలో భాగంగానే మైదాన ప్రాంతంలోని మండలాలైన వైరా, కొణిజర్ల మండలాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధుల పర్యటనలు నామమాత్రంగానే సాగుతున్నాయి.

నియోజకవర్గాల పునర్విభజన తర్వాత కూడా తాము ప్రాతినిథ్యం వహించే అవకాశముందని భావిస్తున్న గిరిజన మండలాలైన ఏన్కూరు, జూలూరుపాడ్, కారేపల్లి మండలాల్లోనే ప్రస్తుత ప్రజాప్రతినిధి, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన పోటీచేయాలనే ఆశావాహులు విరివిగా పర్యటనలు చేస్తున్నారు. అధికారిక, పార్టీ కార్యక్రమాల్లో కూడా అక్కడే చురుగ్గా పాల్గొంటున్నారు. వైరా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధి మాత్రం తన పదవికాలం ముగిసేవరకు తప్పనిసరిగా మైదాన ప్రాంత మండలాల్లో కూడా అభివృద్ధి, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఇక్కడ తిరుగుతున్నారనే భావన ప్రతి ఒక్కరిలో వ్యక్తమవుతుంది.

మంత్రి తుమ్మలకు బేతుపల్లి తిరునాళ్లకు ఆహ్వానం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల

సత్తుపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతుపల్లిలో ఏప్రిల్ 12వ తేదీ నుంచి వైభవంగా జరపతలపెట్టిన అంకమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవానికి కుటుంబ సమేతంగా హాజరు కావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఆదివారం ఆయన నివాసం దమ్మపేట మండలం గండుగులపల్లిలో మంత్రిని కలిసి కరపత్రాలను ఆయనచే ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో చల్లగుండ్ల లోకేశ్వరరావు, అజయ్‌బాబు, కొప్పుల వేణు, శ్రీను, గ్రామస్థులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు

ఏన్కూరు, మార్చి30(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును స్వగ్రామం దమ్మపేట మండలం గండుగులపల్లిలో ఉగాది పండగ సందర్భంగా ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు భగవాన్ నాయక్‌తండా మాజీసర్పంచ్ గుగులోత్ శోభన్‌నాయక్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాజీవ్ లింక్‌కెనాల్ భూనిర్వాసితుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పూర్ణకంటి మైసారావు, కిషన్‌నాయక్ తదితరులున్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మధిరటౌన్, మార్చి30(ఆంధ్రజ్యోతి): మధిర బంజార కాలనీ శ్రీలక్ష్మి పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ 16వ వార్షిక బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను ఆలయ కమిటీ అధ్యక్షురాలు గుర్రం ప్రమీల ఆదివారం ఆవిష్కరించారు. మే 6 నుంచి 10వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసుల అనంతాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రంగా వెంకటేశ్వర్లు, కళ్యాణపు పుల్లారావు, గొండేల ముత్తయ్య, పుతుంబాక కృష్ణప్రసాద్, నాగిరెడ్డి, కటకం నరసింహరావు, మందడపు రామకృష్ణ, చీదిరాల సత్యానార్యాణ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం నగరంలో చలి వేంద్రాల ఏర్పాటు

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత పెరిగి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదు అవుతున్నాయి. పల్లెల నుంచి పట్టణాలకు వచ్చిన ప్రజలతో పాటుగా నగరంలో పలు పనుల కోసం బయటకు వచ్చిన వారికి మంచినీళ్లు కావాలంటే డబ్బులు వదలాల్సిందే. అయితే ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఖమ్మం నగరంలో జన సంచారం అధికంగా ఉండే ప్రధాన రహదారులు, వాణిజ్య కేంద్రాలు, కూడళ్లపై సర్వే చేయించి గుర్తించారు. 40 ప్రాంతాలను గుర్తించి వాటిలో చలి వేంద్రాలను ఏర్పాటు చేశారు. పరిశుభ్రమైన ప్రదేశాల్లో మట్టి కుండలతో హట్‌ల నిర్మాణం చేశారు. ఒక్కో చలివేంద్రంలో నాలుగు కుండలను ఏర్పాటు చేసి వాటిలో నీటిని ఎప్పటికప్పుడు ఉంచే బాధ్యతలను ప్రత్యేకంగా ఉద్యోగులకు కేటాయించారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ చేపట్టాలి

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ మృతికి శాంతి చేకూరాలని ఆదివారం రాత్రి నగర క్రైస్తవులు ఫెలోషిప్ ఆధ్వర్యంలో పెవిలియన్ గ్రౌండ్ నుంచి ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించి, కొవొత్తులతో ఘన నివాళి అర్పించారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం విచారణ నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మైనారిటీలకు ప్రభుత్వం పెద్దపీట

» ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్

ఏన్కూరు, మార్చి30(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనారిటీలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. ఆదివారం స్థానిక సాయితాగూర్ ఫంక్షన్‌హాల్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింల పవిత్ర రంజాన్ పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఇస్లాం మతం సూచించిన సన్మార్గంలో ప్రయాణించాలని కోరారు. ప్రభుత్వం అన్ని మతాలకు సముచితస్థానం కలిపిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, మండల నాయకులు లాలునాయక్, వాసిరెడ్డి నాగేశ్వరరావు, పటాన్ మజీద్‌ఖాన్, దళపతి భువనేశ్వరరాజు, కట్ట సత్యనారాయణ, లచ్చిరాంనాయక్, నన్నెఖాన్, మైబెల్లి, గౌర్‌ఖాన్, పాషా, గాలీబ్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



రంజాన్ తోఫాను అందజేస్తున్న మందడపు అశోక్‌కుమార్

ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ

పెనుబల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): లంకాసాగర్ మాజీ సర్పంచ్ మందడపు అశోక్‌కుమార్ రంజాన్ పర్వదినం సందర్భంగా ఆదివారం ముస్లింలకు రంజాన్ తోఫాను అందజేశారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

క్రీస్తు శ్రమలను స్మరిస్తూ అల్లిపల్లికి పాదయాత్ర



అల్లిపల్లికి పాదయాత్రగా వెళ్తున్న క్రైస్తవులు

సత్తుపల్లిరూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలోని కార్మెల్ మాత చర్చి (ఆర్‌సీఎం) సంఘస్థులు సత్తుపల్లి నుంచి ఆంధ్రాలోని అల్లిపల్లి మరియ తల్లి దేవాలయం వరకు ఆదివారం పాదయాత్రగా వెళ్లారు. పరిశుద్ధ శుక్రవారం నుంచి వచ్చేనెల గుడ్‌ఫ్రైడే వరకు క్రైస్తవులు 40రోజుల పాటు చేపట్టిన ఉపవాస దినాల సందర్భంగా ఈ పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా ఫాదర్ కృపా తమనంపల్లి మాట్లాడుతూ ఏసుక్రీస్తు సర్వమానవాళి పాపపరిహారానికై తనను తానూ బలిగా అర్పించుకొనుచు ఆయన అనుభవించిన శ్రమలను వివరించారు. యాత్రలో క్రైస్తవ గీతాలను ఆలపిస్తూ.. భక్తిశ్రద్ధలతో అల్లిపల్లి మరియతల్లి కొండకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ సతీష్, సహాయ గురువుల ఫాదర్ జ్వాన్నెస్, సిటీసీ సిస్టర్స్, సంఘ పెద్దలు వీవీ. ఆనంద్, ప్రకాష్, సురేష్, కృష్ణయ్య, శ్రీరామ్, రామకృష్ణారెడ్డి, డేవిడ్ తదితరులున్నారు.

ముస్తాబైన ఈద్గాలు



ఈద్గా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ముస్లిం మతపెద్దలు

కల్లూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నెల వంక కన్పించడంతో ముస్లింలు సోమవారం ఈదు ఉల్ ఫితర్ (రంజాన్) పండుగను జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద సాముహికంగా ఈదుల్ ఫిత్ర్ నమాజు వేడకలను జరుపుకునేలా ఈద్గాలు ముస్తాబు చేశారు.

ఘనంగా ఎల్లమ్మకు బోనాలు



బోనాలను తీసుకెళ్తున్న మహిళలు

ముదిగొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురం గ్రామంలోని గౌడ్స్ తమ కులదైవం అయిన ఎల్లమ్మకు ఆదివారం బోనాలు సమర్పించుకున్నారు. సంప్రదాయం ప్ర కారం ఉదయం రజకులు ఇంటిముందు మామిడి, వేప తోరణాలు కట్టారు. మహిళలు ఒక్కపొద్దులతో బోనాలు, నైవేద్యాన్ని తయారుచేసి డప్పు వాయిద్యాలు, శివశక్తుల పూనకాలతో ఎల్లమ్మ గుడికి బోనాలు తీసుకువెళ్లి సమర్పించారు. గ్రామాన్ని పాడిపశుసంపద, పిల్లపాపలతో చల్లంగా చూడు అంటూ ఎల్లమ్మను వేడుకున్నారు. కార్యక్రమంలో గౌడసంఘం పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

టీజీ సెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



హిమాన్షు



అశ్విత

ఏన్కూరు, మార్చి30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదలచేసిన (టీజీసెట్) గురుకుల ఐదో తరగతి ప్రవేశపరీక్ష ఫలితాల్లో ఏన్కూరు మండలం ఇందిరానగర్ కాలనీకి చెందిన హిమాన్షు ప్రతిభ చూపి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రథమస్థానం సాధించా డు. ఉషోదయ పాఠశాలలో 4వతరగతి చదువుతున్న శిక్షణ పొందాడు. అదే పాఠశాల నుంచి అశ్విత అనే విద్యార్థిని బాలికల విభాగంలో జిల్లాలో మూడోస్థానంలో నిలిచింది. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ రాధిక మాట్లాడుతూ పాఠశాలలో మొత్తం 63మంది విద్యార్థులకు గాను 59మంది గురుకుల ప్రవేశపరీక్షల్లో అత్యంత ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యం, వెంకటేశ్వరరావు, నరసింహారావు, శ్యామ్, శారద, ఐశ్వర్య, తేజ,మణి, , రాము తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ తొలగించాలని వినతి



భట్టికి వినతిపత్రం ఇస్తున్న వ్యాపారులు

మధిరటౌన్, మార్చి30(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో ఆర్‌వి కాంప్లెక్స్ సెంటర్ నుంచి సాగర్ మెడికల్స్ వరకు బ్రిడ్జి కింద వేసిన ఫెన్సింగ్‌ను తొలగించి, అక్కడ వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయించాలని స్థానిక వ్యాపారులు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. ఆదివారం మధిర లోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి మునిసిపాలిటీ వారు ఆర్వోబీ కింద ఫెన్సింగ్ వేయడం వలన ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందని చెప్పారు. కొనుగోలు దారులు దుకాణాల ముందు వాహనాలు నిలిపితే ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందని పోలీస్ వారు జరిమానా వేస్తున్నారని, ఫెన్సింగ్ తొలగించి అక్కడ పార్కింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన భట్టి మునిసిపల్ కమిషనర్‌ను పరిశీలించి తగు చర్యలు తీసుకోమని ఆదేశిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోనేరు లీలాశంకర్, డోకుపర్తి సత్యంబాబు, పాతూరి సాంబశివరావు, శ్రీను పాల్గొన్నారు.

బీరప్ప స్వామికి ప్రత్యేక పూజలు



బీరప్ప ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

కొణిజర్ల, మార్చి30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తనికెళ్ళ గ్రామంలో ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం గ్రామంలోని బీరప్ప ఆలయంలో యాదవ, కురములంతా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులంతా ఆలయంకు చేరుకొని బీరప్ప, కామరాతి లకు పూజలు చేశారు. ఉగాది సందర్భంగా భక్తులు స్వామివారికి బోనాలను సమర్పించారు. ప్రతి ఉగాదికి స్వామి వారికి పూజలు చేయటం ప్రత్యేకతను గ్రామంలో చాటుకున్నారు. డప్పు వాయిద్యాల మధ్య భక్తులంతా ఆలయంకు చేరుకొని పూజలు చేసి మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు మేకల వెంకటేశ్వర్లు(రాజు), పఠాన్ గూడె వెంకన్న, కురుమ, యాదవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారులకు కొత్త ఫోన్‌నెంబర్లు

ఖమ్మం వ్యవసాయం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో పనిచేసే వ్యవసాయ శాఖలోని అన్ని విభాగాల అధికారుల ఫోన్ నెంబర్లు మారినట్లు జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య ఆదివారం తెలిపారు. గతంలో అందరి వద్దా 7సిరీస్‌తో ఉన్న ఒడాఫోన్ కంపెనీ నెంబర్లు ఉండేవని, ప్రస్తుతం వా టిని మార్చినట్లు తెలిపారు. కొత్తగా 8 సిరీస్‌తో ఉన్న ఎయిర్‌టెల్ కంపెనీ ఫో న్ నెంబర్లు వాడుకలోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. రైతులు తమ సమీపంలోని అధికారుల వద్ద కొత్త నెంబర్లను తీసుకోవాలని ఆయన సూచించారు.

అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలు

తిరుమలాయపాలెం, మార్చి30(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం అసువులు బాసిన అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలు చేపడతామని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను తెలిపారు. ఆదివారం మండలంలోని పిండిప్రోలులో సీపీఎం మండల సీనియర్ నేత గజ్జల వెంకటయ్య వర్ధంతి సభలో ఆయన మాట్లాడుతూ ఈప్రాంతంలో వెంకటయ్య సీపీఎం పార్టీ విస్తరణకు ఎనలేని కృషిచేశారన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడి వాటిని పరిష్కరించారన్నారు. ఈకార్యక్రమంలో పద్మనాభుల సుధాకర్, పప్పుల ప్రసాద్, రామనబోయిన రవి, పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు

మధిరటౌన్, మార్చి30(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఆదివారం మధిర లోని ఆయన క్యాంపు కార్యాలయంలో పలువురు నాయకులు, ప్రజలు కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. భట్టికి ఉగాది శుభాకాంక్షలు తెలిపిన వారిలో, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైరా ఏసీపీ రెహ్మాన్, మధిర సీఐ మధు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ తదితరులు ఉన్నారు.



భట్టికి ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజలు

అందరికీ మంచి జరగాలి : ఎమ్మెల్యే

వైరా, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్నివర్గాల ప్రజలు శ్రీవిశ్వావసు నామ సంవత్సరంలో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఆకాంక్షించారు. వైరాలోని తమ క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సతీమణి లలిత, కుటుంబసభ్యులతో కలిసి క్యాంపు కార్యాలయంలోని వినాయక విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం పంచాంగ శ్రవణ పఠనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఏడాది పాడి పంటలతో రైతులు, ఉపాధి అవకాశాలతో ఇతర వర్గాల ప్రజలు ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. అలాగే ఈ ఏడాదిలో వైరా నియోజకవర్గాన్ని అగ్రపథాన నిలిపేందుకు అన్నివరులు సమకూర్చాలనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, నాయకులు కట్ల రంగారావు, బొళ్ల గంగారావు, పొదిల హరినాథ్, పణితి శ్రీను, షేక్.అన్వర్, పమ్మి అశోక్, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, పాలేటి నర్సింహారావు, నర్వనేని అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలో ఆదివారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే పుణ్యస్నానాలు ఆచరించి ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కల్లూరు/కారేపల్లి/సత్తుపల్లి: తెలుగు వారి తొలి పండుగ ఉగాదిని సంప్రదాయకంగా ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. నూతన వస్త్రాలు కానుకగా పరస్పరం అందిచారు. ఆలయాల్లో భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పండితులు పంచాంగం శ్రవణం చేశారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ప్రజలు అత్యంత సంతోషంగా ఉంటారని పంచగకర్తలు చెప్పారు.



వైరాలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

